www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 2 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 215 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## 85వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం రుద్రాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 01:**
ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో 85వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం భక్తి శ్రద్ధల నడుమ కొనసాగుతోంది. భాగంగా బుధవారం నిర్వహించిన రుద్రాభిషేకం లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు సతీ సమేతంగా పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మహా శివుడి కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ... భగవంతుడిని ఆరాధించారు



## సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన పొన్నం బ్రదర్స్

( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
జూబ్లీహిల్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన సోదరుడు టిపిసిసి లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తోకలిసి బుధ వారం నాడు మర్యాద పూర్వకంగా సీఎం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 2 లో..



## ఆస్ట్రేలియా పర్యటనకు సిఎం రేవంత్

- 13న ఉన్నతస్థాయి బృందంతో వెళ్లనున్న సిఎం
- క్రీడా విశ్వవిద్యాలయ ఏర్పాటుపై పరిశీలన

2 లో..

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 13వ తేదీన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్రంలో క్రీడావిశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్

## డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ బలోపేతానికి కృషి

- ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహా



2 లో..

( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్ లోని తన నివాసంలో డ్రగ్స్ కంట్రోల్

## సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు,హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ ను బుధ వారం నాడు ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా జేబీఎస్(జూబ్లీ బస్ స్టాండ్) లో ప్రయాణికులతో మంత్రి ముచ్చటించారు. బస్ స్టేషన్ లో టాయిలెట్స్ పరిశీలించారు. రోడ్డు భద్రతా మాసంలో భాగంగా డ్రైవర్ లతో మాట్లాడి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలని మంత్రి అధికారులకు సూచించారు. క్యాంటీన్ లో ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు. క్యాంటీన్ లో నాణ్యమైన



ఆహారంఅందించాలనిసూచించారు. జేబీ ఎస్ లో ఉన్న కార్గో సెంటర్ ను మంత్రి పరిశీలించారు. రోజూ ఇక్కడి నుండి వెళ్ళే ప్రయాణికులు సంఖ్య కార్గో ,పార్శిల్ లు ఎన్ని తదితర వాటి గురించి మంత్రి ప్రభాకర్ అడిగి తెలుసుకున్నారు. జేబీఎస్ లో శానిటేషన్ సిబ్బంది తో . 2 లో..



## ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
కామారెడ్డి బిజెపి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డికి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా తనను కలిసిన వెంకట రమణ రెడ్డి ని ప్రజల సేవలో భాగమైన మీకు ఆ భగవంతుడు మంచి ఆరోగ్యాన్ని, దీర్ఘాయుష్షుని ప్రసాదించాలని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు, అలాగే తన జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి కి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు,

## రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- ఫసల్ భీమా యోజన పథకం పొడిగింపు
- కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంపు
- డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 లకే అందచేత
- రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగింపు
- కేంద్ర కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్






**న్యూఢిల్లీ,జనవరి1( వెలుతురు):**
దేశవ్యాప్తంగా రైతుల కోసం చేపట్టిన.. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని పొడిగించాలని కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అవన్నీ రైతుల సంక్షేమం కోసమే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పంటల బీమా పథకమైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మరింతగా మెరుగుపరచాలని నిర్ణయించారు. ఈ 2 లో..

## భగీరథమ్మ చెరువులో కూల్చివేతలు సక్రమమే

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):**



ఖాజాగూడ భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో కూల్చివేతలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమర్థించారు. నిబంధనలు పాటిస్తూనే ఆక్రమణలు కూల్చివేశామని ప్రకటించారు. 'నీటి వనరుల్లోని 2 లో..

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి సీతక్క

- ఇతర కాంగ్రెస్ నేతలు



( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క తో పాటు పలువురు నేతలు ఉన్నారు, ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క తో పాటు సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన వారిలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి , నాయకులు అద్దంకి దయాకర్, మహిళా నేతలు బండ్రు శోభా రాణి, ఇందిర శోభన్ తదితరులు పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి కి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు,

## నగర వాసులకు రేవంత్ తీపి కబురు

- మేడ్చెల్, శామీర్ పేటలకు మెట్రో పొడిగింపు
- డిపిఆర్ సిద్ధం చేయాలని ఎన్వీరెడ్డికి ఆదేశం

**హైదరాబాద్,జనవరి1 వెలుతురు:**
రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. మెట్రో రైలు పొడిగింపులో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. 2 లో..



## ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు

- ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు
- మీడియా సమావేశంలో కెటిఆర్ వ్యాఖ్యలు

పార్టీ నేతలు, అభిమానుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు 2 లో..





ఆంగ్ల నూతన సంవత్సరము సందర్భంగా డీకే అరుణ మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యులు గారికి నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలిపిన బొక్క బాల్ రెడ్డి బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు
హైదరాబాద్ వెలుతురు జనవరి 01:

## తెలంగాణ భవన్ లో క్యాలెండర్ ను ఆవిష్కరించిన కేటీఆర్




( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
బుధ వారం తెలంగాణ భవన్‌లో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు,ఈ కొత్త సంవత్సరంలో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని కేటీఆర్ అన్నారు,

## ప్రజలకు సిఎం, డిప్యూటి సిఎం శుభాకాంక్షలు

- ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష



**అమరావతి,జనవరి1( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరంలో ఏపీ ప్రజలు అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ నూతన ఏడాది అన్నం పెట్టే అన్నదాతల జీవితంలో సుఖ 2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## ఆస్ట్రేలియా పర్యటనకు సిఎం రేవంత్

విశ్వవిద్యాలయాన్ని ఆయన పరిశీలించనున్నారు. సిఎంతో పాటు ప్రభుత్వ సలహాదారుడు జితేందర్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్, స్పోర్ట్ ఎండి సోనీ బాల, స్పోర్ట్ చైర్మన్ శివసేనా రెడ్డి వెళ్లనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈనెల 13వ తేదీ రాత్రి ఆస్ట్రేలియా బయలుదేరి వెళతారు. 14, 15, 16, 17 నాలుగు రోజుల పాటు సిఎం బృందం పర్యటించనుంది. అక్కడ క్వీన్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని ఈ బృందం పరిశీలించనుంది. తిరిగి ఈనెల 18వ తేదీన సింగపూర్‌కు ముఖ్యమంత్రి బృందం అక్కడ షాపింగ్ మాల్‌ను, క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను పరిశీలించనుంది. అదే విధంగా సింగపూర్‌లో జరుగనున్న పారిశ్రామికవేత్తల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొంటారు. అనంతరం 19వ తేదీన సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్ వెళ్లి అక్కడ 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పర్యటించనుంది. దావోస్‌లో 20 నుంచి 24వ తేదీ వరకు 5 రోజుల పాటు 'ప్రపంచ ఆర్థిక వేదిక' 55వ వార్షిక సదస్సు జరుగుతుంది. సిఎంతో పాటు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు మూడు రోజులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. 2024లో దావోస్ పర్యటన సందర్భంగా సుమారు రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుత పర్యటనలోనూ మరిన్ని పెట్టుబడుల ను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ సదస్సులో 50కి పైగా దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలున్న రంగాలను చాటిచెప్పడం ద్వారా విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు దావోస్ సమావేశాల్లో 'తెలంగాణ పెవిలియన్' పేరుతో ప్రత్యేక పెట్టుబడుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ బలోపేతాని కృషి




అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన అన్యువల్ రిపోర్ట్ ను శాఖ డైరక్టర్ జనరల్ కమల్ హాసన్ రెడ్డి తో కలిసి ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ను బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో నిషేధిత, నకిలీ మందులు, ఎంఆర్పీ వయలేషన్స్ పాల్పడుతున్న వారిపై, ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా రాష్ట్రానికి సరఫరా చేస్తున్న డ్రగ్స్ రాకెట్ కు పాల్పడుతున్న అక్రమార్కులపై ఎంతో సమర్థవంతంగా, కఠినంగా వ్యవహరించి 2024 వ సంవత్సరంలో 573 కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు.(2023 లో కేవలం 56 కేసులు నమోదు అయ్యాయి) అని మంత్రి పేర్కొన్నారు,నకిలీ మందుల తయారీ చేసే, సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరించి అక్రమార్కులపై కేసులు నమోదు చేసిన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. రాష్ట్రం లో డ్రగ్స్ రాకెట్ నిర్వహించే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. అనుమతులు లేని మెడికల్ , ఫార్మా కంపెనీల పై చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొనుగోలులో ప్రజలు అవగాహన ను పెంచుకోవాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అన్నువల్ రిపోర్ట్ విడుదల కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ రాందాన్, డిప్యూటీ డైరెక్టర్ లు రాజవర్ధన చారి, పి. సరళ, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు గోవింద సింగ్ నాయక్, అనిల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన పొన్నం బ్రదర్స్

రాష్ట్రంలో అన్ని సమస్యలకు పరిష్కారం చూపే దిశగా లీగల్ సెల్ కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ను సైతం బలోపేతం చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో లీగల్ సెల్ తో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పొన్నం అశోక్ సీఎం కు వివరించారు, అలాగే లీగల్ సెల్ కు కూడా తాము సహకరిస్తామని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ప్రజలకు సిఎం, డిప్యూటి సిఎం శుభాకాంక్షలు

సంతోషాలు తీసుకురావాలని కోరారు. ఈ మేరకు ప్రతిఒక్కరు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు.'రాష్ట్ర ప్రజలు నూతనోత్సాహంతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని, ఆశలు ఆశయాలూ తీర్చే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. రాష్ట్ర ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాష్ట్ర పునర్ నిర్మాణానికి అంకితం కావాలని కోరుకుంటూ అందరికి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు' అని సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. ప్రజలందరికీ ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు అని జనసేన పార్టీ పేర్కొంది. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ నూతన ఏడాది ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలు, ఆనందాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నా. గడచిన



ఏడాదిలో రాష్ట్ర ప్రజలు విధ్వంస, నియంతృత్వ పాలనను తరిమికొట్టి ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఎన్నో ఆశలు, ఆనందాలు, సంతోషాలను మోసుకువస్తున్న కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. తెలుగువారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని మంత్రి నారా లోకేశ్ ట్వీటారు.

## సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్







మంత్రి మాట్లాడారు ,బస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండలని మంత్రి సూచించారు .బస్ స్టేషన్ లో ఉన్న షాపులను పరిశీలించారు . షాపులలో నాణ్యమైన ఆహార వస్తువులు ఉండాలని,కాలం చెల్లిన ఆహార వస్తువులు ఉంటే చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు.స్టాల్స్ లో అదనపు రేట్లకు వస్తువులు అమ్మరాదని ఒకవేళ అలాంటి పిర్యాదులు వస్తె చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.డ్రింకింగ్ వాటర్ ను పరిశీలించారు.ఫ్లాట్ ఫాం లను పరిశీలించారు .ఫ్లాట్ ఫాం లపై డిస్ ప్లే బోర్డులు కనిపించే విధంగా ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు .ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ఇతర అధికారులు ఉన్నారు

## భగీరథమ్మ చెరువులో కూల్చివేతలు సక్రమమే

(మొదటి పేజీ తరువాయి..)

నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయవచ్చు. ఇటీవల జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇదే అంశంపై తీర్పు ఇచ్చింది. చట్టాలను పాటిస్తూ, కోర్టులను గౌరవిస్తూనే ఆక్రమణలు తొలగిస్తున్నాం. మానవతా దృక్పథంతో 24 గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చాం' అని రంగనాథ్ వివరించారు. హైదరాబాద్ ఖాజాగూడలోని బ్రహ్మానికుంట ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు జారీ చేసి 24 గంటలు గడవకముందే కూల్చివేతలు చేపట్టడమేమిటని నిలదీసింది. దీనిపై గతంలో హైడ్రా కమిషనర్‌కు స్పష్టంగా చెప్పినా మళ్లీ అదే కొనసాగిస్తున్నారని, ఇలాగైతే మరోసారి కోర్టుకు పిలిపించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఖాజాగూడలో చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతమంటూ నిర్మాణాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ మేకల అంజయ్య తదితరులు మంగళవారం అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారించాలంటూ (లంచ్ మోషన్) పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నం.18/ఇలో 12640 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారన్నారు. హైడ్రా తరఫు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైడ్రా అధికారులు అక్కడ విచారించిన తరువాతే చర్యలు చేపట్టారన్నారు.

జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అనుమతుల్లేకుండా పిటిషనర్లు నిర్మాణాలు చేపట్టారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు.

నోటీసులు ఇచ్చామని న్యాయవాది చెప్పగా.. 24 గంటలే సమయం ఇస్తారా అంటూ న్యాయమూర్తి నిలదీశారు. కనీసం బాధితుల వివరణ తీసుకోకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని అన్నారు. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారా అని ప్రశ్నించారు.

తాజాగా నోటీసులు జారీ చేసి పిటిషనర్ల వివరణ తీసుకున్నాక.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల్లేకుండా పిటిషనర్లు ప్రహరీ సహా ఏవైనా నిర్మాణాలు చేపట్టినట్లయితే వాటిని జీహెచ్ఎంసీ కూల్చివేయవచ్చని పేర్కొంటూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు.

## నగర వాసులకు రేవంత్ తీపి కబురు

(మొదటి పేజీ తరువాయి..)

హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్యారడైజ్- మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్-2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్‌ఆర్‌ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు.

రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్-2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.

## రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

(మొదటి పేజీ తరువాయి..)

పథకం రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తెచ్చిందన్న కేంద్రం.. కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. దీంతో రైతుల పంటలకు మరింత రక్షణ లభించడంతో పాటు నష్టాల పట్ల ఆందోళన తగ్గనుంది. అలాగే, 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 చొప్పున రైతులకు అందజేసేందుకు రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు అంకితం చేశారన్న అశ్వినీ వైష్ణవ్.. రైతుల సంక్షేమం గురించి ఈ భేటీలో చర్చ జరిగిందన్నారు. రెండు పంటల బీమా పథకాలను కేంద్రం 2025-26 వరకు పొడిగించినట్లు తెలిపారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కాలానికనుగుణంగా పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాలకు 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా.. దాన్ని 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాలకు గాను రూ.69,515.71 కోట్లకు పెంచారు. ఈ పంటల బీమా పథకాల అమలులో సాంకేతికతను వినియోగించేందుకు రూ.824.77 కోట్ల కార్పస్‌తో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ టెక్నాలజీ వినియోగంతో పంట నష్టం అంచనాలను త్వరగా తెలుసుకోవడంతో పాటు క్లెయిమ్ సెటిల్‌మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. క్యాబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం మాది. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణం. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేశాం. వారి విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభమైన తొలి రోజు భేటీ అయిన.. ఈ తొలి కేబినెట్‌ను రైతులకు అంకితం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. డీఏపీ ఎరువులపై అదనపు భారాన్ని భరించాలని కేంద్రం నిర్ణయించిందని సోదాహరణగా ఆయన వివరించారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి గతేడాది వరకు.. అంటే 2024 చివరి వరకు.. ఎరువుల సబ్సిడీ కింద రూ. 11.9 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు చేసింది. అదే విధంగా 2024లో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రైతుల కోసం రూ. 6 లక్షల కోట్ల విలువైన 23 కీలక నిర్ణయాలను కేంద్రం తీసుకుంది.

## ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):** కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ అభిమానులు కెటిఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఫార్ములా ఈ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్ములా ఈరేస్ కేసులో తెలంగాణ హైకోర్టులో ఏ తీర్పు వస్తుందో చూద్దామన్నారు. ఇందులో అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడది అని ప్రశ్నించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు అని వ్యాఖ్యలు చేశారు. ఈకేసులో ఈడీ ఎదుట ఈనెల 7న హాజరుపై తన లాయర్లు నిర్ణయిస్తారని తెలిపారు. ఏసీబీ కేసులో అస్సలు పస లేదని..తనకు న్యాయస్థానాల పై నమ్మకం ఉందన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. 'పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు' అంటూ సెటైర్ విసిరారు. రూ. 600 కోట్ల సంగతి అటుంచితే.. ఒక్క పైసా కూడా అవినీతి లేదన్నారు.జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు. ' నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్ రెడ్డి.. ఒక ముఖ్యమంత్రినా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27న భారీ బహిరంగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది మెదటి హాఫ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు.. వచ్చే అక్టోబర్ వరకు సమయముందని తెలిపారు. పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు. రైతుబరోసాతో రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తిరుగుబాటు రాబోతోందన్నారు. రైతుభరోసా కొందరకికే ఇచ్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఎందుకు అని ప్రశ్నించారు. బ్యాంకులను ముంచేటోళ్ళకే సెల్ఫ్ డిక్లరేషన్ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజిస్ట్రేషన్లు ఇవ్వాలని రేవంత్‌కు లేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వమే కోర్టులో కేసులు వేయిస్తోందన్నారు. ఉద్యోగస్తులు, పాన్ కార్డ్ ఉన్నవాళ్ళకు రైతుభరోసా ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఃూగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్.. హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నిన్న (డిసెంబర్ 31) విచారణ జరిపిన హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు ఈకేసు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రేపు (జనవరి 2) ఈడీ ముందుకు విచారణకు హాజరుకానున్నారు. అలాగే జనవరి 3 ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరవుతారు. వీరిద్దరి విచారణ మీద ఈనెల 7 కేటీఆర్ ఈడీ విచారణకు హాజరుకావాలా వద్దే అనేదానిపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# నేడు ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 1:**
గురువారం సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో అందరికీ అందుబాటులో రాష్ట్ర రెవిన్యూ. గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందుబాటులో ఉంటారని క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు, ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో పర్యటన వివరాలు వెల్లడించారు, మంత్రి పర్యటన లో భాగంగా సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఖమ్మంలోని మంత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, పుర ప్రముఖులకు అందుబాటులో ఉంటారని దయాకర్ రెడ్డి తెలిపారు.

## ఏఐటియుసి నూతన కమిటీ ఏర్పాటు

### - హరిసింగ్ నాయక్



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, జనవరి 1:**
అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాటసింగారం ఫ్రూట్ మార్కెట్లో ఏఐటియుసి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు జరిగింది. ఈ కమిటీ కి అధ్యక్షులు, కార్యదర్శులు, 12 మంది కార్యవర్గం, 25 మంది కౌన్సిల్ సభ్యులతో కూడిన నూతనకమిటీని నియమించారు,ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్, అజ్మీరా హరి సింగ్ నాయక్.ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నరసింహ, అధ్యక్షులుగా హాజీ భాయ్, అధ్యక్షులు, మస్తాన్ భాయ్,ప్రధాన కార్యదర్శిగా చిన్న గౌడ్, కోశాధికారి పోశయ్య, సహాయ కదర్శిగా శంకర్ నాయక్, గంగారాం, దేవేందర్, లైక్, 12 మంది కార్యవర్గం, 25 మంది కౌన్సిల్ సభ్యులతో కూడిన కమిటీ నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని హరి సింగ్ నాయక్ వివరించారు.

## మాజీ ట్రాన్స్ కో సీఎండీ ని కలిసిన విద్యుత్ శాఖ ఉద్యోగ సంఘం నేత చుక్క గిరి



**వెలుతురు, వనస్థలి పురం, జనవరి 1:**
రాష్ట్ర ప్రభుత్వం మాజీ ట్రాన్స్ కో అండ్ జెన్ కో చైర్మన్ దేవుల పల్లి ప్రభాకర్ రావు ను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర విద్యుత్ శాఖ కార్మిక సంఘాల నేతలు చుక్క గిరి ఇతర నాయకులు బోయ మల్లేష్, శివరాల మహేందర్, హెచ్చు శ్రీకాంత్ లు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రభాకర్ రావు చుక్క గిరి ఇతరలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు అందరూ కలిసి విద్యుత్ శాఖ ను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి సహకరించాలని కోరారు, అలాగే తాము కూడా విద్యుత్ శాఖ ఉద్యోగులు గా విధులు సక్రమంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు,

## సీఎంను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీఎస్ శ్రీగణేష్



**వెలుతురు, సిటీ కల్చరల్ :**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పిడపర్తి శ్రీగణేష్ బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆడపిల్లల్ని రక్షించండి

### సగరపు ప్రసాద్


**హైకోర్ట్ అడ్వకేట్ సీనియర్ జర్నలిస్టు**

హైదరాబాద్ వెలుతురు న్యూస్ జనవరి 01:
మహిళలు లేకుండా ఈ ప్రపంచాన్ని విస్తరించడం అసాధ్యమని కాబట్టి ఆడపిల్ల లను రక్షించడం మన బాధ్యత అని హైకోర్టు అడ్వకేట్ సీనియర్ జర్నలిస్ట్ ప్రసాద్ సాగరపు అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక మరియు విద్యావంతుల యుగంలో కూడా భారతదేశంలో చాలా చోట్ల ఆడపిల్లల భ్రూణ హత్యలు జరుగుతున్నాయని ఇది మన దేశానికి మరియు ప్రపంచానికి చాలా బాధ కలిగించే విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని, సురక్షితమైన వాతావరణంలో పెరిగే విధంగా మహిళలకు చట్టాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం లో మహిళలకు రక్షణ లేదని, అనాధలకు చట్టం లేదని ఉద్దేశంతో జనవరి 23 వ తారీఖున ఢిల్లీలో జంతర్ మంతర్ మైదానంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలో ముందుకు సాగాలి

### మాజీ మంత్రి, మోత్కుపల్లి నర్సింహులు





**హైదరాబాద్ వెలుతురు జనవరి 01:**
2025 నూతన సంవత్సరంలో ప్రజలు సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగి సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, మోత్కుపల్లి నర్సింహులు ఆకాంక్షించారు. ప్రజలకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఒకరికొకరు మంచిని పంచుతూ ఐక్యతను చాటుకోవాలన్నారు. 2024 సంవత్సరంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందిస్తుంది అన్నారు . 2025 సంవత్సరంలో అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సర సందర్భంగా బేగంపేట లోని ఆయన నివాసంలో ప్రముఖ విద్యావేత్త గిరి రెడ్డి ముకుంద రెడ్డి తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మోత్కుపల్లి నరసింహులు గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, ప్రముఖ వ్యాపారవేత్త చిలువేరు సుధాకర్ రెడ్డి, ప్రముఖ అడ్వకేట్ సగరపుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప పడిపూజ కి హాజరైన కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 01:**
బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని జనార్ధన్ బాడాలో నిర్వహించబడ్డ అయ్యప్ప పడిపూజ కి హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్ విచ్చేసి ఆశీర్వచనలు తీసుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## మార్కెట్ నిర్మాణ పనులకు ఆమోదం తెలుపాలని సీఎంను కోరిన చైర్మన్



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, జనవరి 1:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని బుధవారం నాడు జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి .ఈ సందర్భంగా నూతనంగా చేపట్టబోయే నూతన నిర్మాణాల మార్కెట్ పనులకు త్వరగా ఆమోదం తెలపాలని, నూతన మార్కెట్ కి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరినట్లుగా మధు సూధన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే సీఎం సానుకూలం గా స్పందించినట్లు గా ఆయన తెలిపారు,

## బలహీన వర్గాలకు చెందిన ఐఏఎస్, ఐపిఎస్ అధికారులకు ప్రాధాన్యత గల పోస్టుల్లో అవకాశం కల్పించాలి.

### - జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 01:**
బలహీన వర్గాలకు చెందిన ఐఏఎస్,ఐపీఎస్ అధికారులకు ప్రాధాన్యత గల పోస్టులు అవకాశం కల్పించాలని అంతేగాకుండా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక బీసీ ఐఏఎస్ అధికారిని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం బీసీ ఐఏఎస్ లకు వారి సామర్థ్యానికి తగ్గట్టు పోస్టు ఇవ్వకుండా కేవలం కొన్ని వర్గాల వారికే కీలకమైన పోస్టులో నియమించారని అంతేకాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను సైతం ప్రాదాన్యత గల పోస్టుల్లో మరియు ముఖ్యమంత్రి పేషీలో నియమించి తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీసీ ఐఏఎస్ ఐపీఎస్ లను తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. పదే పదే సామాజిక న్యాయం అని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ బీసీలను ఎస్ఐ స్థాయి నుంచి ఐపీఎస్ స్థాయి వరకు వారిని మంచి పోస్టుల్లో అవకాశం కల్పించాలని జాజుల కోరారు.



# సంపాదకీయం..

## పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి !

దేశంతో పాటు ప్రపంచమంతా కొత్త సంవత్సరంలోకి అడుగిడిన వేళ..ప్రజలంతా కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని కోరుకుంటున్న వేళ..రాజకీయ నాయకులు, పాలకులు కూడా అదే ఆశయాలతో ముందుకు సాగితే దేశం పురోగమిస్తుంది. కానీ రాజకీయ నాయకులు ఎల్లవేళలా ఓటుబ్యాంకు దృష్టిలోనే ఆలోచనలు చేస్తున్నారు. అదే కోణంలో పథకాలు గానీ, పనులుగానీ చేస్తున్నారు. దీంతో దేశం ముందుకు సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం,రూపాయి పతనం వంటి సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే. వాటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం లేదు. ధరల అదుపునకు చర్యలు లేవు. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా..రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. కొనుగోలుదారులు మాత్రం అధికధరలతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 140కోట్ల మంది భారతీయులు ఉన్న మన దేశంలో కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. దీనికతంటికి పాలకుల విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులను చేసి, పనులకు దూరం చేస్తున్నారు. ఈ సమస్యలపై చర్చించి ముందుకు సాగాలన్న బలమైన సంకల్పం పాలకుల్లో కొరవడింది. ఐదేళ్లు గడిచేలోగా..మరో ఐదేళ్లకు వేసుకునే ప్రణాళికలతో పాలకులు సాగుతున్నారు. సమిష్టి కృషితో దేశాన్ని ముందుకు నడిపిస్తు న్నామని ప్రధాని మోడీ నూతన సంవత్సరానికి ముందు ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలా అయితే భారతదేశం పురోగమించదని, ప్రజలు సమస్యలు, అప్పులు, పన్నుల భారం నుంచి బయటపడరని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇకపోతే భాగస్వామ్య పక్షాలుగా ఉన్నా టిడిపి,జనసేన తదితర పార్టీలు కూడా చొరవ తీసుకుని మంచి సలహాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. పెన్షన్లు 4వేలకు పెంచి పంచడమే గొప్ప ఘన కార్యాంగా ఎపి సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. మంత్రులు, పార్టీ పెద్దల సలహాలు తీసుకుని పాటించే ఆనవాయితీ మోడీకి ఎలాగూ లేదు. కనీసం భాగస్వామ్య పక్షాలతో అయినా చర్చించే పరిస్థితి లేదు. ఇకపోతే గతేడాది అనేక ముఖ్య ఘట్టాలను మనం పరిశీలించవచ్చు. దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టంగా భావించాలి. కొడిగట్టి పోతున్న కాంగ్రెస్‌కు నూనె పోసి దీపం వెలిగించిన ఘనత మోడీదే. మోడీ నిరంకుశ విధానాలతో కాంగ్రెస్ మళ్లీ బతికి బట్టకట్టింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడం ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాం. కానీ అయోధ్యలోనే బిజెపి పతనం చెందింది. కారణమేమంటే అక్కడి స్థానికులకు లబ్ది కలిగేలా, వారికి దారి చూపేలా పథకాలు అమలు కాలేదు. అయితే గత సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనదిగానే చెప్పుకోవాలి. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఇదో రకంగా మోడీకి శరాఘాతంగా భావించాలి. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు తిరుగులేదని అనిపించుకున్నారు. ఎన్నికల్లో గెలవడం తెలుసుకున్న మోడీ ప్రజల మనసులను మాత్రం గెలవలేకపోతున్నారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలను నరకయాతన పెడుతున్నా సమీక్షించుకోవడం లేదు. ఈ క్రమంలో 2025 ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరంగా భావించాలి. మారుతున్న ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో భారత్‌లో కూడా మార్పులు రావాల్సి ఉంది. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది. మోడీ ఇంతవరకు గట్టిగా నిలబడి ఏదేని సమస్యపై చర్చించిన దాఖలాలు లేవు. పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం లేకుండా పోతున్నది. 2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్‌ఆద్మీ పార్టీలు మనుగడకోసం కష్టపడు తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. అయితే మోడీ తన ఆర్థిక విధానాలను, పాలనా తీరును సమీక్షించుకోక తప్పదు. లేకుంటే మోడీ అస్తిత్వం కూడా ప్రశ్నార్థకం కాగలదు. దేశానికి దిశదశ చూపేలా రాజకీయాలు చేయాలి. ప్రజల బాటలో నడవాలి. అప్పుడే మోడీ నిలుస్తారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా ఆన్‌లైన్ బిజినెస్

- భారీగా ఆర్డర్ చేసిన కండోమ్స్..లో దుస్తులు
- ఫుడ్‌కు యధావిధిగానే పెరగిన డిమాండ్

**న్యూఢిల్లీ,జనవరి1 వెలుతురు**

భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారత్‌లో ఏ వస్తువుల ఎక్కువగా ఆర్డర్ చేశారో తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స్ వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లో అత్యధిక బుకింగ్స్ పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని వెల్లడించింది. కూల్ డ్రింక్స్, ఐస్ క్యూబ్స్ కూడా భారీగా ఆర్డర్ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్ ద్వారా డెలివరీ 6,834 ఐస్ క్యూబ్స్ ప్యాకెట్లు, అదే సమయానికి బిగ్ బాస్కెట్‌లో ఐస్ క్యూబ్‌ల ఆర్డర్‌లు 1290 శాతం పెరిగాయి. 7:41 గంటల సమయంలో 119 కిలోలు ఐస్ క్యూబ్స్ డెలివరీ అయ్యాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది.




బిగ్‌బాస్కెట్‌లో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ విక్రయాలు 552 శాతం పెరిగాయి. డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్‌ల ఆర్డర్స్ సైతం 325 శాతం పెరిగాయి. సోడా, మాక్‌టెయిల్ విక్రయాలు సైతం 200 శాతం పెరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా అత్యధిక విక్రయాలు జరిగిన మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు.

లో దుస్తులు సైతం కొందరు ఆర్డర్ పెట్టడం విశేషం.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కస్టమర్ కళ్లకు గంతలు కట్టి, చేతికి సంకెళ్లు కావాలని ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. వీటితో పాటు గతంలో ఎన్నడూ లేనంతగా కూల్ డ్రింక్స్, చిప్స్ విక్రయాలు పెరిగాయంటే ఎక్కువగా ఇంట్లో కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ జరుపుకున్నారని ఈకామర్స్ దిగ్గజాలు చెబుతున్నారు.

# టీమిండియా ఆటతీరుతో బేజార్

- తీవ్ర ఒత్తిడిలో హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్

**న్యూఢిల్లీ, జనవరి1 వెలుతురు:**

మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి.. మరోవైపు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు పూర్తిగా సంక్లిష్టం.. ఈనేపథ్యంలో టీమ్ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం పూర్తిగా వేడెక్కినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల టీమ్ఇండియా ఫలితాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని నాలుగో టెస్టులో తీవ్రంగా నిరాశపరిచిన స్టార్‌ప్లేయర్ల ఆటతీరుపై గంభీర్ గ÷ర్ అయినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి.



మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగివచ్చిన ఆటగాళ్లపై అతడు మండిపడినట్లు తెలుస్తోంది. ఇక చేసింది చాలు అని పేర్కొనట్లు సమాచారం. కొంతమంది ఆటగాళ్లు పేలవ షాట్లు ఆడి వికెట్లు కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కోచ్‌గా బాధ్యతలు చేపట్టగానే.. ఆటగాళ్లు వారి మార్గాల్లోనే ఆడేందుకు గంభీర్ ఆరు నెలలు స్వేచ్ఛ ఇచ్చాడని.. కానీ ఇప్పుడు అదంతా ముగిసిందని పలువురు అంటున్నారు. ఇప్పటినుంచి జట్టు వ్యూహాలకనుగుణంగా ఆడనివారిపై వేటు వేసే దిశగా చర్యలు ఉంటాయని అతడు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌కనుగుణంగా గంభీర్ తీసుకుంటున్న వ్యూహాలకు.. మైదానంలో ప్లేయర్ల ఆటతీరుకు మధ్య పొంతన ఉండటం లేదనే దానిపై చర్చ నడుస్తోంది. ఇటీవల ముగిసిన టెస్టులో రిషభ్ పంత్ బాధ్యతారాహిత్యంగా ఆడి వికెట్ సమర్పించు కున్నాడు. అదే మ్యాచ్‌ను కోల్పోవడంలో కీలకంగా మారింది. మరోవైపు కోహ్లీ మరోసారి తన బలహీనతను చాటుకొని స్లిప్‌లో చిక్కాడు. ఇక రోహిత్ శర్మ ఏ స్థానంలో వచ్చినా.. రాణించలేకపోతున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా ప్రారంభించినప్పటికీ.. చివరికీ తన పాత ఆటతీరునే కొనసాగించి విఫలమయ్యాడు. ఇలా సీనియర్ల ఆటతీరు గంభీర్‌ను బాధించిందని.. త్వరలోనే తీవ్రమైన చర్యలకు అతడు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాహుల్ ద్రవిడ్ అనంతరం హెడ్ కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. టీమ్ఇండియాకు మిశ్రమ ఫలితాలే వస్తున్నాయి. శ్రీలంకతో వన్డే సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాండ్‌పై వైట్‌వాష్, తాజా బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కోచ్‌పైనా విమర్శలు వస్తున్నాయి. జట్టు ఎంపిక విషయం, వ్యూహాల్లో గంభీర్ పాత్ర ఏంటనే దానిపై పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు



**హైదరాబాద్,జనవరి1 వెలుతురు:**

కొత్త సంవత్సరం వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. చిన్నా, పెద్దా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో భాగస్వాములై.. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. ఇక న్యూ ఇయర్ సంబురాలు ముగియడంతో.. బుధవారం ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాలకు భక్తులు తరలి వెళు_న్నారు. నూతన సంవత్సరం రోజున తమ ఇష్ట దైవాన్ని దర్శించుకుని, అంతా శుభం జరగాలని భక్తులు కోరుకుంటున్నారు. ఇక భక్తుల తాకిడిని ముందే ఊహించిన ఆలయాల అధికారులు.. వారి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ, జోగులాంబతో పాటు ఇతర ఆలయాలకు భక్తులు బారులు తీరారు. దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. హైదరాబాద్ నగరంలోని చిలుకూరు బాలజీ టెంపుల్, బిర్లా మందిర్, పెద్దమ్మ తల్లి ఆలయం, జూబ్లీహిల్స్, హిమాయత్ నగర్‌లోని టీటీడీ ఆలయాలు, పద్మారావు నగర్‌లోని స్కంధగిరి టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు.

# ఇంటివాడు కాబోతున్న యువ ఎంపి తేజస్వి



**బెంగళూరు,జనవరి1 వెలుతురు:**

దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు దక్షిణ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండోసారి గెలిచిన ఆయన చెన్నైకు చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ విషయాన్ని బెంగళూరులో ఆయన స్వయంగా ప్రకటించారు. మార్చి 24న ముహూర్తం నిర్ణయించినట్లు వెల్లడించారు. శివశ్రీ.. మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి భరతనాట్యంలో ఎంఎ, మద్రాస్ సంస్కృత కళాశాలలో సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు.

# సూర్యపేట జిల్లాలో విషాదం

## వ్యక్తిని బలిగొన్న భూ తగాదాలు

**సూర్యాపేట,జనవరి1 వెలుతురు:**


సూర్యాపేట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. భూతగాదాలు ఓనిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. నూతన సంవత్సర వేడుకలకు పిలిచి ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. ఈ విషాదకర సంఘటన చివ్వెంల మండలం లక్ష్మి తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన ధరావత్ శేషు(39)కు అదే తండాకు చెందిన తన ప్రత్యర్థులతో కొంత కాలంగా భూ వివాదాలు చేటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శేషు ప్రత్యర్థులు న్యూఇయర్ వేడుకలకు పిలిచి కత్తితో గొంతు కోసి దారుణంగా హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శేషు మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- మృతి చెందిన భార్యాభర్తలు

**జగిత్యాల,జనవరి1 వెలుతురు:**

ధర్మపురి పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు దంపతులను వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భర్త అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులను రామయ్యపల్లె గ్రామానికి చెందిన కూస చంద్రయ్య(60), కూస భాగ్యమ్మ(55)గా పోలీసులు గుర్తించారు. న్యూ ఇయర్ సందర్భంగా రాత్రి ధర్మపురి చర్చిలో ప్రార్థనల నిమిత్తం దంపతులిద్దరూ వెళ్లారు. ప్రార్థనల అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై వారి బైక్‌ను కారు ఢీకొట్టింది. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# భూలక్ష్మినగర్ సంక్షేమసంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్




**వెలుతురు, వనస్థలి పురం, జనవరి 1:**
హయత్ నగర్ డివిజన్లోని భూలక్ష్మి నగర్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా భూలక్ష్మీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులకు , కాలనీవాసులకు హయత్ నగర్ డివిజన్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు, అదేవిధంగా కాలనీ వాసులందరూ కలిసికట్టుగా ఉంటూ ప్రతి సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మరియు కాలనీవాసులందరు ప్రతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆయన తెలిపారు , నూతనంగా ఎన్నికైన కాలనీ కమిటీ సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించారు, ఈ కార్యక్రమం లో వారు కాలనీలోని సమస్యలు , కాలనీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు,ఈ కార్యక్రమంలో కేంద్ర ఫిలిప్ సెన్సార్ బోర్డ్ సభ్యులు అప్పారావు ,బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి ,కాలనీ ప్రధాన కార్యదర్శి రవి కిరణ్ ,ఉపాధ్యక్షులు శ్రీధర్ ,కార్యదర్శి సామ దామోదర్ రెడ్డి ,మహిళా అధ్యక్షురాలు విజయ రంగి ,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు విద్యాలత ,నాలినికిరణ్ ,విజయలక్ష్మి మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మా గురువు చారిటబుల్ ట్రస్ట్ వికలాంగులకు,వృద్ధులకు దుప్పట్ల పంపిణి



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 01:**
సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలో లింగ వారి గూడెం గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో మా గురువు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీకుమండ్ల సుధీర్, నవీన్, రాజు సమకూర్చిన దుప్పట్లను సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా కోఆర్డినేషన్ లో 50 మంది వికలాంగులకు, వృద్ధులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి దాతల చేతుల మీదుగా పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణ కత్తుల మాట్లాడుతూ ఊర్లో ఉన్న వికలాంగులకు వృద్ధులకు చాలా రోజుల నుంచి దుప్పట్లు పంపిణీ చేయాలని సంకల్పంతో అట్టి విషయాన్ని విచ్చేసిన దాతలకు తెలుపగా ఆ విన్నపాన్ని మన్నించి ఈరోజు మనకి దుప్పట్లు తెచ్చారని వారికి హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. దాత సుధీర్ మాట్లాడుతూ బాలకృష్ణ ఊరు మీద ఉన్న ప్రేమ అభిమానం మమ్మల్ని ఇక్కడిదాకా తీసుకొచ్చింది. మీకు సహాయం చేయాలని సంకల్పించాము కనుక తోచిన సహాయాన్ని ఈ దుప్పట్ల రూపంలో మీ ముందుకు తీసుకొచ్చాము. ముందు ముందు మరికొన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణ కత్తుల, నరసింహ కత్తుల, సైదులు, కృష్ణ, అధిక సంఖ్యలో వికలాంగులు వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పెద్దింటి కొండల్ రెడ్డి, తోట్ల ఉప్పలయ్య లకు విప్లవ జోహార్లు

- CPM మండల కార్యదర్శి కాందాల శంకర్ రెడ్డి




**వెలుతురు న్యూస్ నూతనకల్ జనవరి 1**
నూతనకల్ మండలం చిల్పకుంట్ల లో కామ్రేడ్ కొండల్ రెడ్డి,తోట్ల ఉప్పలయ్య వర్ధంతి లను ఘనంగా నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. మధ్యతరగతి రైతు కుటుంబం అయిన పెద్దింటి లింగామల్లారెడ్డి-సావిత్రమ్మ చివరి సంతానం గా జన్మించిన కామ్రేడ్ కొండల్ రెడ్డి %ణ్ఖీ×% గ్రామ కార్యదర్శిగా ప్రజా సమస్యల పైన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పైన పోరాటం చేశాడని కొండల్ రెడ్డి ఎదుగుదలను ఓర్వలేని శత్రువులు అనేకసార్లు తనపై దాడులు చేసిన మొక్కవోణీ ధైర్యం తొ ముందుకు సాగిన నిజమైన కార్యకర్త అని అన్నారు. కామ్రేడ్ ఉప్పలయ్య కల్లు గీత కార్మిక కుటుంబం లో పుట్టి అనేక ఉద్యమాలలో నేను సైతం అంటూ ముందు వరుస లో నిలబడే వాడు అని అన్నారు.వీరి జీవితాలు నేటి యువతరానికి స్ఫూర్తి దాయకం అని అన్నారు. స్తూపాల దగ్గర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సామ వెంకట్ రెడ్డి,తోట్ల లింగయ్య కార్యదర్శి లు బొజ్జ శ్రీను,బత్తుల తిరుమలేష్, కూసు సైదులు,గజ్జల శ్రీనివాస్ రెడ్డి మరియు కార్యకర్తలు యర్ర ఉప్పల్ రెడ్డి, సామ సురేందర్ రెడ్డి,ముండ్ల సంజీవ, జటంగి లింగయ్య,బాణాల వెంకట్ రెడ్డి,తోట్ల అచ్చయ్య, సామ వెంకట్ రెడ్డి,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**

## ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు.





వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 1 సూర్యాపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ తెలియజేస్తూ, నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ప్రజల భద్రత కొరకు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు ముందస్తుగా జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకునేల కట్టుదిట్టమైన భద్రత పరమైయాన చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతిష్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిసెంబర్ 31 రాత్రి బందోబస్తు నిర్వహించడం జరిగినదన్నారు. ప్రజలను, యువతను ముందస్తుగా అప్రమత్తం చేసి ప్రమాద రహిత వేడుకలను పెద్దలు, తల్లిదండ్రులు అందరితో కలిసి సంతోషంగా ఇండ్లలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. డి జె లు, బాణాసంచా, త్రిబుల్ రైడింగ్, బైక్ రేసింగ్ లు, బహిరంగ మధ్యపానం, రోడ్లపై కేక్ కటింగ్ లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్లనే జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని వివరించారు.జిల్లా వ్యాప్తంగా పోలీసులు అర్ధరాత్రి దాటే వరకు విస్తృతంగా ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించారని, పోలీసు వారి సూచనలు, ప్రభుత్వ నిబంధనను ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారిపై డిశంబర్ 31 రాత్రి సుమారు 800 లకు పైగా మోటార్ ట్రాన్స్పోర్ట్ చట్టం ఉల్లంఘనల కింద కేసులు నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు. తాగి వాహనాలు నడుపుతున్న 200 మందిపై కేసు నమోదు చేయడం జరిగిందని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 89 వాహనాలపై కేసులు చేయడం జరిగినదని చెప్పారు. ఉత్సవం, వేడుకలు ఏవైనా ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా సంతోషంగా జరుపుకోవాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించిన విషయం సత్ఫలితాలు ఇచ్చి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జిల్లాలో చోటు చేసుకోలేదని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ వివరించారు.

# మతిస్థిమితం లేని మహిళను శక్తి సదన్ లో చేర్పించిన సోమిడి వేణు



**కరీంనగర్ వెలుతురు జనవరి 01:**
కరీంనగర్ కిసాన్ నగర్ లో మతిస్థిమితం లేని ఓ మహిళను పోలీసుల సహకారంతో బిజెపి దళిత మోర్ఛ జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు శక్తి సదన్ లో చేర్పించారు. వివరాల్లోకి వెళితే గత నాలుగైదు రోజులుగా కిసాన్ నగర్ లోని మైత్రి కన్వెన్షన్ ఎదురుగా మతిస్థిమితం లేని మహిళ సంచరిస్తూ ఉండడంతో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు గమనించి కరీంనగర్ త్రీ టౌన్ సిఐ సహకారంతో అశోక్ నగర్ లోనీ శక్తి సదన్ లో ఆ మహిళకు ఆశ్రయం కల్పించారు.

ఈ సందర్భంగా సోమిడి వేణు ప్రసాద్ త్రీ టౌన్ సిఐ కి , అదేవిధంగా అరుంధతి నగర్ ఆడపడుచులకు మహిళను ఆశ్రమంలో చేర్పించడానికి సహకరించిన స్థానిక యువకులు శ్యామ్, రాగటి శ్రీనివాస్. చిరంజీవి, భాను, శేఖర్, మచిందర్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో 16 మంది ఎస్ జి టి టీచర్ల

# తొలగింపు

- జిల్లా విద్యాధికారి సత్య నారాయణ

**వెలుతురు, యాదాద్రి భువనగిరి, జనవరి 1:**



యాదాద్రి భువనగిరి జిల్లాలో దీర్ఘ కాలంగా విధులకు దూరంగా ( ఆబ్సెంట్ అవుతున్న వారు)ఉంటున్న 16మంది ప్రభుత్వ స్కూల్ సెకండరీ టీచర్ల ను విధుల నుంచి తొలగింపులను చేసినట్లుగా యాదాద్రి భువనగిరి జిల్లా విద్యా అధికారి కె, సత్యనారాయణ తెలిపారు, జిల్లాలోని ఎస్ జి టి టీచర్లు పని చేయకుండా దీర్ఘ కాలం గా విధులు హాజరు కావడం లేదని జిల్లా లోని ఎం, ఉమ దేవి, క్రాంతి కిరణ్, గీత రాణి, నర్సింహ రావు, శైలజ, భాగ్య లక్ష్మి, కిరణ్ కుమారి, విజయ లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, ఉమ రాణి, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, స్వప్న, మాధవి, నవీన్ కుమార్ లు తమ విధులకు హాజరు కాకుండా దీర్ఘకాలికంగా విధులకు గైరాజరైన ఈ 16మంది స్కూల్ సెకండరీ టీచర్ల కునోటీసులు ఇచ్చిన స్పందించక పోవడంతో వారిని సర్వీస్ నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారిచేసినట్లుగా యాదాద్రి భువనగిరి జిల్లా డిఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు.

# స్నేహా చికెన్ వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు

- కలుషిత నీరు త్రాగి క్యాన్సర్ బారిన పడుతున్న ప్రజలు
- కంపెనీ నుంచి వస్తున్న కంపుతో ఊపిరి తీసుకోలేక శ్వాసకోశ సమస్యలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి
- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**అడ్డాకుల మండలం వెలుతురు జనవరి 01:**
అధికారుల అండదండలు ప్రజాప్రతినిధుల అభయ హస్తంతో స్నేహ చికెన్ పరిశ్రమ యాజమాన్యం రెచ్చిపోతుందని, స్నేహ ఫార్మ్స్ నుంచి వచ్చే వ్యర్ధ పదార్థాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని, వెంటనే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు స్పందించి చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండు చేశారు. బుదవారం అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామ చెరువు సమీపంలో స్నేహ చికెన్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను పరిశీలించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వారి ఇష్టా రాజ్యంగా కాలువలలో వదులుతున్నారని మండిపడ్డారు.. స్నేహ ఫార్మ్స్ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు పొలాలలో వదలడంతో అవి బలీదుపల్లి, పెద్దమునగల్ చేడు వాగులో కలిసి కలుషితమై సరళసాగర్ మీదుగా రామన్‌పాడు డ్యామ్‌లోకి వెళు తున్నాయన్నారు. రామన్‌పాడు డ్యామ్ నుంచి సరఫరా అయ్యే కలుషితమైన నీరు తాగి పలువురు క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడుతున్నారన్నారు పెద్దమునగల్ చేడ్, బలీదుపల్లి శివారు మధ్యలో జహంగీర్ పీర్ దర్గా దగ్గర నెమలులు, జింకలు ఎక్కువగా ఉంటాయని, ఈ కలుషిత నీరు త్రాగి వాటితో పాటు పశు వులు, గొర్రెలు కూడా చనిపోతున్నాయన్నారు. ప్రభుత్వ నిభందనలకు తూట్లు పొడుస్తూ... ప్రజల జీవితాలలో చెలగాటమాడుతున్న స్నేహ కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పరిశ్రమను మూసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, నాయకులు వెంకటన్న గౌడ్, అంజన్న యాదవ్, దేవర శివ, రమేష్ సాగర్, మల్లేష్ యాదవ్, మ్యాదరి రాజు, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ ఎమ్మెల్యే గౌరవ పాయల్ శంకర్ గారికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు వెలివెత్తాయి

## పార్టీ నాయకులతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు అభిమానులు పుష్పగుచ్చాలు అందించారు శుభాకాంక్షలు తెలిపారు.

## ఈ నూతన సంవత్సరం అందరికీ శుభం కలగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు



- **సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **ఎమ్మెల్యే పాయల శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 01:**
సమస్యల పరిష్కారమ లక్ష్యంగా కొత్త సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో తనను కలిసిన ఉద్యోగుల సంఘ నాయకుల సమక్షంలో ఆయన మాట్లాడారు జిల్లా ప్రజలకు ఉద్యోగ ఉపాధ్యాయ కర్షక కార్మిక సోదరులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల కృషి ఎనలేనిదని ఆయన అన్నారు కానీ రాష్ట్రం వచ్చిన తర్వాత ఉద్యోగులు ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడ్డారని ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని లక్షల బిల్లులు పెండింగ్లో ఉన్న విషయాన్ని ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు రాబోయే రోజుల్లో ఉద్యోగ ఉపాధ్యాయుల గొంతుకై సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజల ఆశయాలు నెరవేరేలా అభివృద్ధికి కలిసిమెలిసి పనిచేద్దామని ఆయన అన్నారు...







# ఘనంగా మేయర్ బర్త్ డే వేడుకలు






**మేడిపల్లి, వెలుతురు:**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు..
ఈ సందర్భంగా బోడుప్పల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జన్మదిన వేడుకలను విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు ఆయన.

ఈ మేరకు తన పుట్టినరోజు సందర్భంగా 800 విద్యార్థులకు సొంత నిధులతో స్కూల్ షూస్ అంది చేశారు.. అంతకంటె ముందు తన పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.. ఈ మేరకు మేయర్ కు సీఎం బర్త్ డే విషెష్ తెలిపారు..

ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్, బింగి జంగయ్య యాదవ్, రాపోలు రాములు, పులకండ్ల జంగా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా "ఆర్.వీ ఫౌండేషన్" క్యాలెండర్ ఆవిష్కరణ





**మేడిపల్లి, వెలుతురు:**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో విష్ణుపురి కాలనీ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు... ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ... ఇతరులకు మన వంతు సహాయం చేయడం సామాజిక బాధ్యతగా భావించి 10 సంవత్సరాలకు పైగా ఆర్.వి ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆధరాభిమానాలు పొందు తుందని తెలిపారు... భవిష్యత్తులో కూడా ఆర్ వీ ఫౌండేషన్ మరింత ఉత్సాహంతో తన సేవ కార్యక్రమాలను కొనసాగి స్తుందని తెలుపారు.. ఈ నూతన సంవత్సరంలో ప్రజల జీవితాల్లో కష్టాలు తొలగిపోయి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.. నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపారు తుంగతుర్తి రవి.. ఈ కార్యక్రమంలో రాం గోపాల్ రావు, సురేందర్ రెడ్డి, సోమయ్య, శరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రునాయక్, శారదా గౌడ్, దివ్య, ఆలయ అర్చకులు కరుణాకర్, వేణుగోపాల్, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, మిత్ర బృందం పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## మిడ్జిల్ మండల కేంద్రంలో దుర్ఘటన

- **ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మహిళ సజీవ దహనం**

**మహబూబ్‌నగర్,జనవరి1( వెలుతురు):**
ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఓ మహిళ సజీవ దహనమైన సంఘటన కలకలం రేపింది. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రంలో ఘటన చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజామున కొత్త సంవత్సరం రోజునే ఈ ఘటన జరగడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తుప్పుడ యాదమ్మ (55) కూతురు నాగమ్మతో కలిసి గత కొంతకాలంగా రేకుల ఇంట్లోనే నివాసం ఉంటోంది. నాగమ్మకు ఆరోగ్యం బాగలేక గత రెండు రోజులుగా పక్కనే ఉన్న తమ్ముడు తిరుపతయ్య ఇంట్లో ఉంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న యాదమ్మ మంగళవారం అర్ధరాత్రి దాటాక రేకుల షెడ్డులోని స్విచ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్‌తోచెలరేగిన మంటలు దుప్పట్లకు అంటుకుని ఇంట్లో విపరీతంగా మంటలు చెలరేగాయి. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యాదమ్మ నిద్రలో తప్పించుకోలేక ఆ మంటల్లో సజీవదహనమైంది.
బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంటి నుండి పొగలు రావడం చూసిన చుట్టుపక్కలవారు యాదమ్మ కొడుకు తిరుపతయ్యకు సమాచారం ఇవ్వగా మంటలను ఆర్పి చూసేసరికి అప్పటికే తల్లి పూర్తిగా కాలిపోయి ఉంది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పురేందర్ రెడ్డి...



**కూకట్ పల్లి జనవరి 1 వెలుతురు:**
వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి బుధవారం పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీని వారి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర సందర్భముగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరములో మన కాలనీవాసులు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అదేవిధంగా అష్ట ఐశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి ఆర్ రామచంద్రరావు, జి ప్రసాద్, ఎస్ శ్రీధర్ రావు, సూర్యనారాయణ , ఏక్ నాథ్, జి రాఘవేందర్, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాణిక్ రావు....



**జహీరాబాద్ వెలుతురు జనవరి 01:**
రేజింతల్ శ్రీ సిద్ధి వినాయక స్వామి 225వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తో కలిసి వారికి ఘన స్వాగతం పలికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, పిఏసిఎస్ చైర్మన్ మచ్చేందర్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు విజయ్ రాథోడ్, మాజీ ఎంపీటీసీ రాములు, హొతి బి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పర్వేజ్ , నాయకులు భీమ్ రావ్ రాథోడ్ దత్తు రేడ్డి, పిజి శంకర్, కిష్టారెడ్డి మోహన్ రాథోడ్ , జియా పటేల్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రాథోడ్, నాగేష్ రాథోడ్, షఖీల్, మొహమ్మద్ హైమద్, ముఖీమ్, తదితరులు యున్నారు.

# కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపాలి...

## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం





**కూకట్ పల్లి జనవరి 1 వెలుతురు:**
నియోజకవర్గ ప్రజలు నూతనోత్సాహంతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని, ఆశలు ఆశయాలూ తీర్చే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల నీ టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్యం శ్రీరంగం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరం పురస్కరించుకొని సత్యం శ్రీరంగం ని వారి నివాసంలో కూకట్ పల్లి నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశామని సమీక్షించుకుని, గెలుపోటములని, మానవమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్షసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టానికి నిర్ణయించుకోవలసిన సమయం ఇది అన్నారు. నూతన సంవత్సరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంత సుఖ సంతోషాలతో ఉండాలని పార్టీ పటిష్టతకు మరింత పాటు పడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, మొయినుద్దీన్, కుక్కల రమేష్, మేకల రమేష్, మహేష్ యాదవ్, ఏ, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు రమాదేవి, సంధ్య, రాష్ట్ర మహిళా నాయకురాళ్లు జ్యోతి, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు విజయలక్ష్మి, జ్యోతి, కృష్ణవేణి, జోజోమ్మ, రజిత, భారతమ్మ, సీనియర్ నాయకులు పులి శ్రీకాంత్ పటేల్ గౌడ్, పులి శివకుమార్ గౌడ్, అక్తర్, సుంకన్న, ప్రకాష్ ముదిరాజ్, శేఖర్ గజానంద్, మాదిరి శ్రీను, బందీగా బాలనరసింహ, నరేష్, సలీం, జెల్ల శివ, తరుణ్ గౌడ్, అరుణ్ గౌడ్, అరుణ్ పిళ్ళై, షాహెన్ష తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అల్గోల్ చౌరస్తాలో రోడ్డుపై రోడ్డు ప్రమాదం...

- జహీరాబాద్ ఆర్టీసీ డిపో బస్సును ఢీ కొట్టిన లారీ..
- బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలు...






**జహీరాబాద్ వెలుతురు జనవరి 01:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జహీరాబాద్ డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సు అల్గోల్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుండి లారీ ఢీకొట్టింది. ముంబయి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ బస్సును వేగంగా ఢీకొట్టడంతో 8 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. 65 నెంబర్ జాతీయ రహదారిపై ప్రమాదంతో ఇరువైపులా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి బస్సు లారీని పక్కకు తప్పించి రాకపోకలు పునరుద్ధరించారు. ఫ్లై ఓవర్ నిర్మించకపోవడంతో అల్గోల్ చౌరస్తాలో తరచు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కొత్త ఏడాది వేళ భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు

**ముంబయి,జనవరి1( వెలుతురు):**



కొత్త సంవత్సరం వేళ భారీ సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్న క్రమంలో భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదు అయ్యాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో కొత్త ఏడాది సంబరాల వేల పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. ఒక్క రాత్రిలోనే 17,800 వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు పోలీసులు పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలో పోలీసులు బుధవారం తెల్లవారుజాము వరకూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి వద్ద నుంచి మొత్తం రూ.89.19 లక్షలను జరిమానాల రూపంలో విధించినట్లు చెప్పారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, సిగ్నళ్లు జంప్ చేయడం, డ్రంకన్ డ్రైవ్ కేసులు వీటిల్లో ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. నగరంలో 8 మంది అదనపు కమిషనర్లు, 29 మంది డిప్యూటీ కమిషనర్లు, 53 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 2,184 మంది ఇన్‌స్పెక్టర్లు, 12 వేలకుపైగా కానిస్టేబుళ్లు రోడ్లపై విధులు నిర్వర్తించారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# శ్రీ సిద్ధివినాయక 225వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు....





**జహీరాబాద్ వెలుతురు జనవరి 01:**
రేజింతల్ శ్రీ సిద్ధి వినాయక స్వామి 225వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం రేజింతల్ లో స్వయంభూ శ్రీ సిద్ధివినాయక 225 వ జయంతి ఉత్సవాల్లో బుధవారం వారు పాల్గొన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివ కుమార్ తదితరులతో కలిసి సిద్ధి వినాయకుడికి పుష్పర్చన, మంగళ హారతి సమర్పించారు. స్వయం భూ గా వెలిసిన శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయం దీనదినాభివృద్ధి చెందుతోందని, భక్తుల కోరిక లు తీర్చే శ్రీ సిద్ధి వినాయక స్వామి వారికి వివిధ రాష్ట్రల కు చెందిన ప్రజలు దర్శనం చేసుకొంటున్నారని, రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెంది నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని హరీష్ రావు ఆకాంక్షించారు. కెసిఆర్ హయాంలో ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు భక్తి శ్రద్దలతో ఇక్కడికి వచ్చి స్వామి వారిని చేసుకుంటురని వారు తెలిపారు. అనంతరం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో హరీష్ రావుకు ఆశీర్వచనాలు అందించారు.

# ఈ ఆహారాలను తినడం వల్ల గ్యాస్ వస్తుంది..

**హైదరాబాద్,జనవరి 1, వెలుతురు :**
ఒకప్పుడు కేవలం జీర్ణ సమస్య ఉన్నవారికే గ్యాస్ వచ్చేది. కానీ ఇప్పుడు అలా కాదు. శిశువులకు కూడా గ్యాస్ సమస్య వస్తోంది. అంటే ఇది ఎంత ఇబ్బంది పెడుతుందో అర్థమవుతుంది. ప్రస్తుతం చాలా మంది గ్యాస్ ట్రబుల్ తో సతమతం అవుతున్నారు. ఇది ఒక కామన్ సమస్యగా మారిపోయింది. అయితే గ్యాస్ వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కానీ ఆహారం అనేది ముఖ్య కారణంగా చెప్పవచ్చు. శరీరానికి సరిపడని ఆహారాలను తిన్నప్పుడు అవి సరిగ్గా జీర్ణం అవక గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తాయి. దీంతో గ్యాస్ ట్రబుల్ సమస్య మొదలవుతుంది. అలాగే వేళకు భోజనం చేయకపోవడం, తినే పదార్థాల్లో అసమతుల్యత ఉండడం, అతిగా ఆహారం తీసుకోవడం, శీతల పానీయాలు లేదా మద్యం అధికంగా సేవించడం, పొగ తాగడం వంటివన్నీ గ్యాస్ ట్రబుల్ కు కారణమవుతున్నాయి. శారీరక శ్రమ చేయకపోయినా కూడా గ్యాస్ ఏర్పడుతుంది.బీన్స్, యాపిల్స్, పప్పు దినుసులు..: బీన్స్, పుట్టగొడుగులు, యాపిల్స్, కొన్ని రకాల పప్పు ధాన్యాలు, చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు, నూనె పదార్థాలను తినడం వల్ల కొందరికి సహజంగానే గ్యాస్ సమస్య వస్తుంది. ఇలా గనక జరిగితే ఈ పదార్థాలను తినడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేయాలి. అలాగే పాలు లేదా పాల ఉత్పత్తులు కొందరికి పడవు. వాటిని తీసుకుంటే వెంటనే పొట్టలో గ్యాస్ ఏర్పడుతుంది. ఇలా గనక జరిగితే పాల ఉత్పత్తులను మానేయాల్సి ఉంటుంది. పాలలో లాక్టోస్ అనే ప్రోటీన్ ఉంటుంది. ఇది సరిగ్గా జీర్ణం అవకపోతే పొట్ట ఉబ్బరం ఏర్పడుతుంది. ఫలితంగా గ్యాస్ వస్తుంది. పాలతోపాటు జున్ను, కోడిగుడ్లు తదితర ఆహారాలు కూడా కొందరికి సరిగగ్గా జీర్ణం కావు. ఇవి తిన్న తరువాత 60 నుంచి 90 నిమిషాల లోపు మీకు బాగా గ్యాస్ వస్తుంటే ఈ పదార్థాలన తినడం మానేయాలని గుర్తుంచుకోండి. ఆలుగడ్డలు, మొక్కజొన్న, గోధుమ పిండి..: పిండి పదార్థాలు అధికం గా ఉండే ఆలుగడ్డలు, మొక్కజొన్న, పిస్తా, గోధుమ పిండి, బ్రెడ్ తదితర




ఆహారాలు కొందరికి పడవు. వీటిని తింటే సరిగ్గా జీర్ణం కావు. దీంతో కూడా గ్యాస్ ఏర్పడుతుంది. అదేవిధంగా పీచు అధికం గా ఉండే ఆహారాలను తిన్నా కూడా కొందరికి సరిగ్గా జీర్ణం కాక గ్యాస్ సమస్య వస్తుంది. ముఖ్యంగా బ్రౌన్ రైస్, బీన్స్, ఓట్స్, గోధుమ లు, పలు రకాల పండ్లు, కూరగాయల్లో పీచు అధికంగా ఉంటుంది. ఇది జీర్ణం అవక గ్యాస్‌ను కలగజేస్తుం ది. కనుక ఈ పదార్థాలతో గ్యాస్ ఏర్పడుతుంటే వెంటనే వీటిని తీసుకోవడం మానేయాలి. లేదంటే సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలు ఉంటాయి. కొవ్వు పదార్థాలు..: కొవ్వు పదార్థాలు సహజంగానే అందరికీ త్వరగా జీర్ణం కావు. కానీ తరచూ కొవ్వు పదార్థాలను తిన్నప్పుడు సరిగ్గా జీర్ణం అవడం లేదు, గ్యాస్ వస్తుంది అంటే.. ఈ పదార్థాలు పడడం లేదని అర్థం. కనుక ఇలాంటి వారు కొవ్వు పదార్థాలను తీసుకోవడం మానేయాలి. అలాగే ప్రాసెస్ చేయబడిన పాలు, ఇతర ఆహారాలను చాలా మంది నేటి తరుణంలో తింటున్నారు. కానీ ఇవి సరిగ్గా జీర్ణం కావు అనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఇవి కూడా గ్యాస్ సమస్యను కలగజేస్తాయి. అలాగే బయట బేకరీలలో లభించే పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, నూనె పదార్థాలు కూడా చాలా మందికి జీర్ణం కావు. ముఖ్యంగా జీర్ణం కాని ఆహారాలను తినడం వల్లనే గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. కనుక ఏ ఆహారాలను తింటే గ్యాస్ వస్తుందో గమనించాలి. అప్పుడు ఆ ఆహారాలను మానేస్తే గ్యాస్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇలా జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# అంతా అమరావతికేనా



**విజయవాడ, జనవరి 1, వెలుతురు:**
మరావతి నిర్మాణానికి మాత్రం అరవై కోట్ల నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధం చేస్తున్నారు. రాజధాని నిర్మాణం కోసం అప్పులు చేసి మరీ జనవరి నెల నుంచి పనులు ప్రారంభించడానికి రెడీ అవుతున్నారు. సీఆర్డీఏ కు ఇప్పటికే ఇరవైనాలుగు వేల కోట్ల రూపాయల పనులకు సంబంధించి అనుమతిమంజూరు చేశారు. ఈవిషయాన్ని మున్సిపల్ మంత్రి నారాయణ తెలిపారు. మంత్రివర్గం కూడా ఆమోదం తెలిపింది. జనవరి నెల నుంచి పనులు ప్రారంభం కావాలని చంద్రబాబు అధికారులను ఇప్పటికే ఆదేశించారు.అయితే అమరావతిపై పెట్టిన శ్రద్ధ, ఖర్చుచేస్తున్న నిధులను సంక్షేమం కోసం మాత్రం పెట్టడంలో కూటమి సర్కార్ ఒకింత వెనకడుగు వేస్తుందన్న విమర్శలు బాగా వినిపిస్తున్నాయి.రాజధాని నిర్మాణం కావాలంటే ఉన్నట్లుండి అభివృద్ధి కాదని, కాలానుగుణంగా అక్కడ పరిస్థితులను బట్టి రాజధాని ప్రాంతం విస్తరిస్తుందన్నఅభిప్రాయం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తుంది. కానీ అదే పనిగా ఒకే పనికి ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి అసెంబ్లీ, సచివాలయం భవనాలను నిర్మించడం, అదీ ఇంత హడావిడిగా చేయడం ఎందుకన్న ప్రశ్నలు నెట్టింట వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వానికి రాజధాని అమరావతి ప్రాధాన్యత అంశమేకావచ్చు కానీ, అదే సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు కూడా అంతే అవసరమని చెబుతున్నారు. భారీగా అప్పులను సేకరించి వాటిని రాజధాని ఒక్కదానికే ఖర్చు చేయడం ఎంత వరకూ సబబని కొందరు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. రాజధాని నిర్మాణ పనులకు తొలి విడతే ఇన్ని వేల కోట్లు ఖర్చు చేస్తే వ్యయం లక్ష కోట్లు దాటే అవకాశం లేకపోలేదన్న అనుమానం కలుగుతుంది. రాజధానితో లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పిన చంద్రబాబు లక్ష కోట్లు అప్పులు చేసి మరీ అమరావతికి అందాలను తేవడం అవసరమా? అన్న ప్రశ్నలు కూటమి పార్టీలను ఇబ్బంది పెడుతున్నాయి.టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తే రాజధాని అమరావతికి ప్రాధాన్యత ఇస్తారని అందరూ ఊహించిందే. అయితే అదే సమయంలో ఆయన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికల మ్యానిఫేస్టోను చూసి జనం కూటమి పార్టీల వైపు మొగ్గారు. ఏదైనా సమతుల్యంతో పనులు జరగాలి. ఇటు అభివృద్ధి పనులు, అటు సంక్షేమం సమానంగా జరుపుకుంటూ వెళితే ప్రజల్లో కూడా ఎలాంటి వ్యతిరేకత రాదని, కానీ వేల కోట్ల నిధులు అమరావతిలో కుమ్మరించడంపై సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతుంది. రాజధానిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలు ఉన్నందున, వాటిని మళ్లీ నిర్మించకుండా ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై పెడితే బాగుంటుందన్న సూచనలు కూడా వెలువడుతు న్నాయి. అమరావతి అభివృద్ధి చెందినంత మాత్రాన పోలో మంటూ పెట్టుబడులు వచ్చిపడతాయా? అన్న ప్రశ్నలు కూడా వినపడుతున్నా యి. సొంత పార్టీ క్యాడర్ కూడా ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్ననిర్ణయాలపై పెదవి విరుస్తుంది. ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి మాటనిలబెట్టుకునే ప్రయత్నం చేయాలి తప్పించి, నిధులన్నీఒకేచోట కుమ్మరించడం ఎంత వరకూ సబబని మరి కొందరు సోషల్ మీడియాలో నేరుగా పార్టీ నేతలను నిలదీస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సుమారు యాభై ఏళ్ల అనుభవమున్న చంద్రబాబు నాయుడు ప్రజలనాడిని కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు చేపడితే బాగుంటుందన్న సూచనలు సైకిల్ పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నాయి.

## పవన్ వన్ సైడ్ అవుతున్నారా..

**హైదరాబాద్, జనవరి 1 వెలుతురు:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నారు. ఆయన ఏపీలో కూటమి ఏర్పాటు కావడానికి ప్రధాన కారణం. ఒకరకంగా బీజేపీ, టీడీపీని ఒక వేదికపైకి చేర్చడానికి పవన్ కల్యాణ్ ముఖ్య కారణం. పవన్ కల్యాణ్ వల్లనే ఆంధ్రప్రదేశ్ లో కూటమి విజయం సాధించింది. మరోవైపు నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలతో సత్సంబంధాలతో పాటు సాన్నిహిత్యం కూడా ఉంది. అలాగే పవన్ కల్యాణ్ అన్నా కూడా ఢిల్లీ పెద్దలకు ప్రేమ, గౌరవం కూడా. పవన్ కల్యాణ్ ను రాజకీయంగా ఎలా ఉపయోగించుకోవాలో కేంద్ర నాయకత్వం కూడా ఆలోచిస్తుంది. అదే సమయంలో దక్షిణ భారత దేశంలో క్రౌడ్ పుల్లర్ గా కూడా పవన్ కల్యాణ్ ను సెంట్రల్ పార్టీ గుర్తిస్తుంది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం కాంగ్రెస్ ముఖ్యమంత్రిని వెనకేసుకు రావడం, పొగడ్తలతో ముంచెత్తడం, ప్రశంసలను కురిపించడం ఇప్పుడు ఏపీలోనే కాదు ముఖ్యంగా తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. సంధ్య థియేటర్ లో జరిగిన ఘటనపై పవన్ కల్యాణ్ తొలిసారి మీడియా ముందు స్పందించారు. అయితే ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి తప్పేమీ లేదన్నట్లు ఆయన అన్నారు. రేవంత్ స్థానంలో ఎవరున్నా అదే చేసేవారని, రేవంత్ సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కూడా కొనియాడరు. ఈ ఘటనలో పుష్ప టీం తప్పేనంటూ పవన్ కల్యాణ్ తెగేసి చెప్పారు. అంతేకాదు ఒకరకంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వెనకేసుకు వచ్చారు. అయితే దీనిపై బీజేపీ నేతలు మాత్రం ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తుంది. ముందస్తు బెయిల్ కు యత్నం బీజేపీ నేతలు మాత్రం... పుష్ప ఘటన తర్వాత జరిగిన పరిణామాలపై ఇటు ఏపీ బీజేపీలోని నేతలు, అటు తెలంగాణ బీజేపీ యావత్తూ అల్లు అర్జున్ వైపు నిలబడింది. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా అనేక స్టేట్ మెంట్లు ఇచ్చారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు అల్లు అర్జున్ ను వెనకేసుకు వచ్చారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి సయితం కూడా అల్లు అర్జున్ తప్పేమీ లేదని ప్రకటన చేశారు. కానీ ఇందుకు విరుద్ధంగా కూట మిలో ఉన్న పవన్ కల్యాణ్ మాత్రం తప్పు అల్లు అర్జున్ టీందేనని తేల్చి చెప్పడంతో రేవంత్ కు మరింతగా క్రేజ్ పెరిగిందంటున్నారు. ఇప్పటి వరకూ మెగా ఫ్యాన్స్, బన్నీ ఫ్యాన్స్ లో ఒకింత వ్యతిరేకత ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ స్టేట్ మెంట్ తో కొంత మైలేజీ పెరిగిందన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. సున్నితమైన అంశంపై... మిత్రపక్షంగా ఉన్నప్పుడు ఒక సున్నితమైన అంశంపై మౌనంగానైనా ఉండాలి. లేదంటే మిత్రపక్షంలోని పార్టీలకు అనుగుణంగా వ్యవహరించాలి. అంతే తప్ప అందుకు విరుద్ధంగా ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రిపై ప్రశంసలు కురిపించడం ఏంటన్న ప్రశ్నలు ఇప్పుడు కమలనాధుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అయితే పవన్ కల్యాణ్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడే రకం కావడంతో ఆయన తన మనసులో ఉన్నది ఆఫ్ ది రికార్డులో చెప్పారని, అంటే చిట్ చాట్ లోనే ఆయన ఈ రకంగా స్పందించారని, బహిరంగ వేదికలపై ఎక్కడా ఈ విషయంపై రెస్పాన్స్ కాలేదన్న విషయాన్ని కూడా జనసేన నేతలు గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద మిత్ర పక్షంగా ఉన్న పవన్ కల్యాణ్ కాంగ్రెస్ నేతలకు వత్తాసు పలకడంపై ప్రధానంగా తెలంగాణ బీజేపీ నేతలు గుర్రుగానే ఉన్నారు.

# కార్పొరేషన్ రద్దు దిశగా అడుగులు

- అప్పుల కోసం.. కార్పొరేషన్లు...
- 5 కార్పొరేషన్లు...95 వేల కోట్లు

**హైదరాబాద్,జనవరి 1, వెలుతురు:**
అప్పు చేయడం తప్పు కాదు.. అవసరం ఉన్నప్పుడు చేయాల్సిందే. అవసరాలు తీర్చుకోవాల్సిందే. అంతే బాధ్యతగా తిరిగి చెల్లించాల్సిందే. ఇదే చాణక్యనీతి చెబుతున్న మాట. కానీ తాహతుకు మించి చేసే అప్పులు పెను నష్టాన్ని కలిగిస్తాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఇదే చేసింది. దొరికిన చోటల్లా అప్పులు చేసింది. అభివృద్ధి చేయడానికే అప్పులు చేశామన్న మాట ఆనాడు వినిపించారు. కానీ మార్కెట్లో ఉన్న వడ్డీల కంటే అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడం ఒక తప్పు.అప్పుల కోసమే కార్పొరేషన్లు సృష్టించి ఎడా పెడా బాకీలు తెచ్చింది గత కేసీఆర్ సర్కార్. ఇప్పుడు అవి గుదిబండగా మారాయి. అప్పుల కుప్పగా అయ్యాయి. అందుకే వాటిలో ఏవి ఉండాలో ఏవి ఊడాలో డిసైడ్ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే చేస్తోంది. అప్పుల కుప్పగా మారిన కార్పొరేషన్ల లిస్టు రెడీ చేసింది. ఏవి సొంతంగా రెవెన్యూ జెనరేట్ చేసుకుని లాభాల్లో ఉన్నాయి.. ఏవి నిండా మునిగాయో లిస్టు రెడీ చేసింది. ఆ ప్రకారంగా వాటిని మూసేసేందుకు సిద్ధమవుతోంది. నిజానికి ప్రభుత్వ ఖజానాను ఫుట్ బాల్ మాదిరి ఆడుకోవడం కరెక్ట్ కాదు.రాష్ట్రంలో చాలా కార్పొరేషన్ల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది. సో వాటికి చెక్ పెట్టేలా లిస్ట్ రెడీ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ నిధులు వృధా అవుతూ ఎలాంటి ఉపయోగం లేని వాటికి గుడ్ బై చెప్పబోతోంది. అందులోని ఉద్యోగులను ఇతర సంస్థల్లో విలీనం చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. అటు ఎస్సీఎస్టీబీసీ కార్పొరేషన్లను మరింత బలోపేతం చేయడం, రెవెన్యూ ఎక్కువ జెనరేట్ చేస్తున్న వాటికి మరింతగా బూస్టప్ ఇచ్చేలా రేవంత్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.తెలంగాణలో ప్రస్తుతం 90కి పైగా కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో ఐదారు తప్ప మిగతా కార్పొరేషన్లకు ఎలాంటి ఇన్ కమ్ లేదు. కేవలం నామ్ కే వాస్తేగా నడుస్తున్నాయి. ఇందులోనూ ఎక్కువ కార్పొరేషన్లు రాజకీయ నిరుద్యోగుల పదవుల భర్తీ కోసం, ప్రభుత్వానికి అప్పులు తెచ్చి పెట్టేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి. సో ఓవరాల్ గా చూస్తే కార్పొరేషన్ల ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పులు 2 లక్షల 82వేల 84 కోట్లుగా ఉంది. ఇది మొత్తం తెలంగాణ రాష్ట్ర అప్పులో 42 శాతంగా ఉందంటే ఏ స్థాయి కుప్ప జమైందో అర్థం చేసుకోవచ్చు.ఇందులో ప్రభుత్వం హామీ ఇచ్చి, తీర్చాల్సిన అప్పులు ఒక లక్షా 27 వేల 208 కోట్లుగా ఉంది. అలాగే గత ప్రభుత్వ షూరిటీలతో అప్పులు తీసుకుని, వాటిని తీర్చే బాధ్యత కార్పొరేషన్ల మీద ఉన్నవి 95 వేల 462 కోట్ల రూపాయలు. అంతే కాదు ఇవన్నీ చాలవన్నట్లుగా కార్పొరేషన్లు సొంతంగా బాకీలు చేసి, తామే తీర్చే అప్పులు 59వేల 414 కోట్లుగా ఉంది. అయితే ఈ కార్పొరేషన్లకు ఇన్ కమ్ లేక వీటి అప్పులను కూడా సర్కారీ ఖజానా నుంచే చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది.ఉన్న కార్పొరేషన్లలో 90 శాతం కార్పొరేషన్లు అప్పుల ఊబిలోనే ఉన్నాయి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా అప్పుల విషయంలో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రస్తుత ప్రభుత్వానికి తలకుమించిన భారంగా మారింది. అందుకే వాటిని సెట్ రైట్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ రెడీ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇది ప్రజల భారాన్ని తగ్గించడం కోసమే. ప్రజల సంక్షేమం బాగుండాలంటే ముందుకు అధిక మిత్తీలకు తెచ్చిన అప్పుల్ని క్లియర్ చేసేయాల్సిన పరిస్థితి ఉంది.ప్రజా ధనాన్ని పకడ్బందీగా వాడాలి. ఎక్కడా రూపాయి వేస్ట్ కావొద్దన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. వాటిని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలన్న కాన్సెప్ట్ తో రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే గుదిబండగా ఉన్న లోన్ల రీస్ట్రక్చరింగ్ పై నజర్ పెట్టింది. అధిక వడ్డీలకు తెచ్చిన లోన్లపై టాప్ అప్ ల జోలికి వెళ్లడం లేదు. ఇంటి కోసం హోమ్ లోన్ తీసుకునే వారిలో కొందరు టైమ్ కంటే ముందుగానే తమ చేతికి డబ్బు అందినప్పుడల్లా ప్రిన్సిపుల్ అమౌంట్ కడుతుంటారు. లోన్ త్వరగా క్లియర్ చేసుకునే పనిలో ఉంటారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా అదే పని చేస్తోంది.తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ, టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్, బేవరేజస్ కార్పొరేషన్, జెన్‌కో, ట్రాన్స్‌కో, సివిల్ సప్లయ్స్, ఫారెస్ట్ డెవలప్ మెంట్, మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్లు, సింగరేణి వంటివి తమంతట తాము సెట్ చేసుకునే పరిస్థితిలో ఉన్నాయి. అంటే వాటికి వివిధ మార్గాల ద్వారా వచ్చే నిధులను జీతాలు, నిర్వహణ ఖర్చుల కోసం వాడుకుంటున్నాయి. ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితిలో లేవు.నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి చూపాల్సిన సెట్విన్ అనే కార్పొరేషన్ పూర్తిగా ఉనికి కోల్పోయింది. ఫిల్మ్ అండ్ టెలివిజన్, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ తో పాటు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసి రైతులకు అందించే ఆగ్రోస్ వంటివి నిధుల్లేక ఖాళీగా చేతులెత్తేసి రెడీగా ఉన్నాయి. ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, హాకా వంటి సంస్థలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోంది. వీటితో పాటే స్టేట్ హ్యాండి క్రాఫ్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్, విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, మేదర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్,ట్యాడీ టాపర్స్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్..మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, వుమెన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, వికలాంగుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ యోగాధ్యయన పరిషత్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆగ్రోస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, టెక్స్‌టైల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్, సెట్విన్, ట్రైకార్, తెలంగాణ ఫుడ్స్ వంటివి ఉన్నాయి. ఇలాంటి సంస్థలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని అనుకుంటోంది. ఏం చేస్తే ఇవి ఉపయోగపడుతాయి? ఎలా చేయాలన్నది ఫైనల్ కాల్ తీసుకోబోతున్నారుఅసలు ఆదాయమే లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నుంచి ఎక్కువ వడ్డీతో అప్పులు తీసుకుంది గత సర్కారు. మొత్తం కార్పొరేషన్ల అప్పులు ఒక ఎత్తు అయితే? ఐదు కార్పొరేషన్లవే ఏకంగా 95 శాతం బాకీలున్నాయి. అందులో నెంబర్ వన్ లాస్ కంపెనీ కాళేశ్వరం కార్పొరేషన్. ఆ తర్వాత డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్, వాటర్ రీసోర్స్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, గొర్రెల కార్పొరేషన్ వంటివి ఉన్నాయి.ఇవే 95 శాతం అప్పులు తెచ్చుకున్నాయి. తెస్తే తెచ్చాయి.. కానీ మార్కెట్ లో ఒక వడ్డీ రేటు ఉంటే అంతకంటే ఎక్కువ పెట్టి తేవడంలో లాజిక్స్ ఏంటన్నది తేల్చే పనిలో ఉన్నారు. మార్కెట్ లో ఇంట్రెస్ట్ రేట్ యావరేజ్ గా 7.63 శాతంగా ఉంది. కానీ ఏకంగా 10.49% వడ్డీతో లోన్లు తెచ్చింది గత సర్కార్. ఇలా ఎవరైనా చేస్తారా? ఇది ఎంత గుదిబండో అర్థం చేసుకోలేకపోయారా? ఓన్లీ అడిగినంత అప్పులు ఇస్తే చాలు అనుకున్నారా?కాళేశ్వరం కార్పొరేషన్ పై 9.69% ఇంట్రెస్ట్ రేటుతో 74 వేల 599 కోట్ల రూపాయలు అప్పు చేశారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్ పై 9.48% వడ్డీ రేటుతో 20,200 కోట్లు అప్పులు చేశారు. వాటర్ రీసోర్స్ కార్పొరేషన్ పై అత్యధికంగా 10.49% ఇంట్రెస్ట్ తో 14 వేల 60 కోట్ల రూపాయలు బాకీలు తెచ్చారు.

ఇది ప్రభుత్వ ఖజానాపై ఎంతలా భారం మోపుతోందో ప్రస్తుత ప్రభుత్వానికి అర్థమవుతోంది. ఇక హౌసింగ్ కార్పొరేషన్ పై 9 వేల కోట్లు, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ పై 2,951 కోట్ల రుణాలు ఉన్నాయి.గొర్రెల కార్పొరేషన్ కింద గత ప్రభుత్వం గొర్రెల స్కీం కోసం 4 వేల కోట్లు, చేపల కోసం మరో 600 కోట్ల అప్పు చేసింది. ఇక హాస్పిటల్స్ నిర్మాణాల కోసం కూడా 3,535 కోట్లు కార్పొరేషన్ల కిందనే బాకీలు తీసుకుంది. అయితే ఇందులో హౌసింగ్ వంటి వాటికి కచ్చితంగా రుణాలు తీసుకోవాల్సినవే. అయితే ఎక్కువ వడ్డీ రేట్లకు బాకీలు తేవడమే ఇప్పుడు ఖజానాను ఖతం చేస్తోంది. తెలంగాణలో కార్పొరేషన్లు ఎలా అప్పుల ఊబిలో ఉన్నాయో చూశాం కదా. వీటితో రోజులు గడిచేకొద్దీ నష్టాలే తప్ప లాభాలు ఉండవు. అందుకే కార్పొరేషన్లను సెట్ చేయడం, లోన్లను రీస్ట్రక్చర్ చేయడం, సాధ్యమైనంత వరకు అసలు, బాకీలు తీర్చుకుంటూ వెళ్లడమే రేవంత్ సర్కార్ టార్గెట్ గా పెట్టుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ అధిక వడ్డీలకు కేసీఆర్ తెచ్చిన ఈ లోన్ల రీ స్ట్రక్చరింగ్ పై రిక్వెస్టులు చేస్తూ వస్తున్నారు. కొంత వరకు సక్సెస్ అయ్యారు కూడా. ఓవైపు గత ప్రభుత్వం సృష్టించిన అప్పుల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తుంటే విపక్షం మాత్రం ఇప్పటి ప్రభుత్వమే అప్పుల మీద అప్పులు చేస్తోందని విమర్శలు చేయడమే విడ్డూరం.

# మహారాష్ట్రలో మావోలకు ఎదురుదెబ్బ

- సీఎం ఫడ్నవీస్ ఎదుట
  11మంది మావోల లొంగుబాటు

**ముంబయి,జనవరి1( వెలుతురు):**
మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమీక్షంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు. అయితే లొంగిపోయిన వారిలో.. తార్కా సిడం సైతం ఉన్నారు. గడ్చిరోలిలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేదని.. అలాంటి ప్రాంతంలో పోలీసులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్చిరోలి ప్రాంతాన్ని చత్తీస్‌గఢ్‌తో అనుసంధానం చేస్తూ.. రహదారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మొబైల్ టవర్లు సైతం నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఇక మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు.. ఇటీవల నాగపూర్‌లో ముగిశాయి. ఈ సమావేశాల్లో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. గత ఏడాది 33 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని చెప్పారు. ఇక గడ్చిరోలి జిల్లా ఉత్తర భాగం పూర్తిగా మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వివరించారు. అలాగే 55 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 33 మంది లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులపై తమ ప్రభుత్వం పోరాటాన్ని



కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇక వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు మూడేళ్ల కాలపరిమి విధించుకున్నామని ఈ సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు. మరోవైపు గడ్చిరోలి ప్రాంతానికి చెందిన వందలాది యువత పోలీస్ శాఖలో చేరారన్నారు. వారిలో 33 మంది యువకులు మావోయిస్టులు బాధితులు ఉన్నారని వివరించారు. ఇక మావోయిస్టుల అగ్రనేతలు సైతం లొంగి పోయి జనజీవన స్రవంతిలో కలిశారన్నారు. 2026, మార్చి మాసాంతం నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. అందుకోసం తనదైన శైలిలో ముందుకు వెళ్తుంది. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం భాగా తగ్గిపోయింది. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. తెలుగు రాష్ట్రాలు, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వారి ప్రాబల్యం దాదాపుగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రాబల్యం కొంత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆ రాష్ట్రంలో సైతం భద్రత దళాలు, స్థానిక పోలీసుల సహాయంలో కూబింగ్ తీవ్రతరం చేసింది.అందులోభాగంగా పలు ఎన్‌కౌంటర్లు సైతం చోటు చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్లలో దాదాపు 27 మంది అగ్రనేతలు మరణించిన విషయం విధితమే. ఇక దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం .. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. కీలక సూచనలు చేస్తున్నారు.

# రాచకొండ పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- దాదాపు 619 కేసులు నమోదు

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):**
దేశ వ్యాప్తంగా న్యూఇయర్ సంబరాలు అంబరాన్ని అంటాయి. న్యూఇయర్ సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకున్నారు. కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. న్యూఇయర్ వేడుకల్లో నో ఆల్కహాల్ అంటూ పోలీసులు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తాగి వాహనాలు నడిపిన వారి పనిపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మందు సేవించిన వారిని పట్టుకున్నారు. వారిపై కేసులు కూడా నమోదు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి.
పెద్ద సంఖ్యలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు పోలీసులు. బుదవారం ఉదయం వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మందు సేవించి వాహనం నడిపిన అనేక మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో మద్యం సేవించిన అనేక మంది పోలీసులకు చిక్కారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 619 డ్రంక్




అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. మల్కాజ్‌గిరి డివిజన్‌లో 230 కేసులు నమోదు కాగా భువనగిరి డివిజన్లో 84 కేసులు నమోదయ్యాయి. అలాగే ఎల్బీనగర్లో 232 కేసులు నమోదు అవగా.. మహేశ్వరంలో 47 కేసులు నమోదయ్యాయి. మరోవైపు పంజాగుట్టలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసులు పెద్ద షాకే తగిలింది. వెంగల్‌రావు పార్క్ వద్ద మద్యం సేవించి వెళుతుండగా ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తికి బ్రీత్ ఎన్‌లైజర్ టెస్ట్ నిర్వహించగా..
అందులో వచ్చిన సంఖ్య చూసి పోలీసులు అవాక్కయ్యారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో 550 రీడింగ్ నమోదు అయ్యింది. 550 ఆల్కహాల్ రీడింగ్ రావడంతో ఆశ్చపోవడం పోలీసుల వంతైంది. వెంటనే ఆ వ్యక్తిపై కాప్స్ కేసు నమోదు చేశారు. అయితే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికి 550 పాయింట్స్ వచ్చిన ఆ వ్యక్తి మాత్రం.. తాను రేవంత్ అన్న తాలూకా అంటూ పోలీసుల ఎదుట బుకాయింపుకు దిగాడు.

## ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, న్యూఢిల్లీ,జనవరి1( వెలుతురు ) :**
నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ లో పోస్టు చేశారు. ఈ సంవత్సరం కొత్త అవకాశాలు, విజయాలు, అంతులేని ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. 'హ్యాపీ 2025! ఈ సంవత్సరం ప్రతి ఒక్కరికీ కొత్త అవకాశాలు, విజయాలు మరియు అంతులేని ఆనందం తీసుకురావాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, శ్రేయస్సుతో ఆశీర్వదించబడాలి' అని ఆయన ఎక్స్ లో పేర్కొన్నారు.

## నాని అనుచరుడు కాళీకి పది వరకు రిమాండ్

- వైద్య పరీక్షల అనంతరం నెల్లూరు జైలుకు తరలింపు

**గుడివాడ, జనవరి1( వెలుతురు):**
మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీకి న్యాయస్థానం రిమాండ్ విధించింది. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఆయన్ను గుడివాడ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఈ నెల 10 వరకు కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. ఆ తర్వాత నిందితుడు కాళీని పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. వైకాపా అధికారంలో ఉండగా గుడివాడ తెదేపా కార్యాలయం, ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీ కీలక సూత్రధారి. 2022 డిసెంబరు 25న రాత్రి.. కాళీ తన అనుచరులతో కలిసి తెదేపా కార్యాలయం, రావిపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేశాడు. ఈ సంఘటనపై రావి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా నాటి అధికార పార్టీ ప్రోద్బలంతో నిందితులను అరెస్టు చేయలేదు. పైగా రావి వర్గీయులు, ఇతర తెదేపా నాయకులపై ఎదురు కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘటన వీడియోలను పోలీసులు పరిశీలించి హత్యాయత్నం సెక్షన్‌ను జోడించారు. ఈ క్రమంలో డిసెంబరు 4న పది మంది నిందితులను ఏకకాలంలో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ముఖ్య నిందితుడైన కాళీ.. అస్సాం రాష్ట్రంలో చేపల వ్యాపారం చేస్తున్నాడని గుర్తించి పక్కా ప్రణాళికతో మంగళవారం అదుపులోకి తీసుకుని గుడివాడకు తీసుకొచ్చారు. నేడు వైద్యపరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

## మన్మోహన్ స్మారక స్థలం ఎంపికపై కసరత్తు

- ప్రక్రియను ప్రారంభించిన కేంద్రం



**న్యూఢిల్లీ,జనవరి1( వెలుతురు):**
మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం నిర్మించే పక్రియను కేంద్రం ప్రారంభించింది. రాజ్‌ఘాట్, రాష్ట్రీయ స్మృతి స్థల్‌తో పాటు కిసాన్ ఘాట్ సమీపంలో 1 నుంచి 1.5 ఎకరాల స్థలంలో స్మారక చిహ్నం కోసం ప్రతిపాదించినట్టు సమాచారం. పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు ఈ ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. ఈ రెండు స్థలాల్లో ఒక స్థలాన్ని ఎంచుకోవాలని మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు అధికారులు సూచించినట్టు తెలుస్తోంది. కొత్త విధానం ప్రకారం, మెమోరియల్ కోసం స్థలాన్ని ట్రస్టుకు మాత్రమే కేటాయించాల్సి ఉంటుంది. ఆ కారణంగా ప్రాజెక్టు ప్రారంభించడానికి ముందు ట్రస్టు ఏర్పాటు కావాలి. ట్రస్టు ఏర్పాటయిన వెంటనే భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణం కోసం సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌తో ఎంఓయూపై సంతకం చేయాలి. కాగా, మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సంజయ్ గాంధీ స్మారకాలు ఉన్న రాజ్‌ఘాట్‌కి సమీపంలో ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. మన్మోహన్ సింగ్ మరణానంతరం స్మారక చిహ్నం నిర్మాణంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కూడా నడిచింది. స్మారక చిహ్నం కేటాయించే చోటులోనే అంత్యక్రియలు జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని బీజేపీ తిప్పికొట్టింది.

## అణుస్థావరాల జాబితా పరస్పర మార్పు

- ఒప్పందాన్ని మరో ఏడాది పొడించిన భారత్, పాక్



**న్యూఢిల్లీ,జనవరి1( వెలుతురు):**
భారత్, పాకిస్థాన్ తమ దేశాల్లోని అణు స్థావరాల జాబితాను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా పాటించాయి. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒకరి దేశంలోని అణు కేంద్రాలపై మరో దేశం దాడి చేయకూడదనే ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ జాబితాను అందజేసుకున్నాయి. ఇరుదేశాలు ఏకకాలంలో ఈ పక్రియ పూర్తి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. 'దౌత్యమార్గాల ద్వారా భారత్, పాకిస్థాన్ తమ అణు స్థావరాల జాబితాను పంచుకున్నాయి. ఏకకాలంలో ఈ పక్రియ పూర్తయ్యింది. కశ్మీర్ సమస్యతో పాటు సీమాంతర ఉగ్రవాదంపై కూడా రెండు దేశాల మధ్య జాబితా మార్పిడి జరిగింది. ఈ జాబితాను ఇలా ఇచ్చిపుచ్చుకోవడం ఇది వరుసగా 34వ సారి' ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా.. అణు స్థావరాలపై దాడులకు వ్యతిరేకంగా కుదిరిన ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు ఈ వివరాలను పరస్పరం అందజేసుకుంటున్నాయి. 1988 డిసెంబర్ 31న ఈ ఒప్పందంపై భారత్, పాక్ సంతకం చేశాయి. ఆర్టికల్-2 నిబంధన ప్రకారం ప్రతి సంవత్సరం అణు స్థావరాల సమాచారం అందజేసుకోవాలి. దీని ప్రకారం 1992 జనవరి 1 నుంచి ప్రతి సంవత్సరం అదే రోజు అణు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయి.

# నెల్లూరు టూ గోదావరి.. పందెం కోళ్లు... రెడీ



**నెల్లూరు, జనవరి1( వెలుతురు):**
సంక్రాంతి అంటే పందెం కోళ్ల చిందులు గుర్తుకొస్తాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో కోళ్ల పందాలు చాలా జోరుగా భారీ ఎత్తున జరుగుతాయి. అందుకోసం ఇప్పటి నుంచి సిద్ధం అవుతున్నారు. పందెం కోళ్లను నెల్లూరు జిల్లాలో పెంచి, గోదావరి జిల్లాల్లో అమ్ముతున్నారు. సంక్రాంతి అంటే పందెం కోళ్లు గుర్తుకొస్తాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో కోళ్ల పందాలు చాలా జోరుగా భారీ ఎత్తున జరుగుతాయి. అందుకోసం ఇప్పటి నుంచి సిద్ధం అవుతున్నారు. పందెం కోళ్లను నెల్లూరు జిల్లాలో పెంచి, గోదావరి జిల్లాల్లో అమ్మకాలు మొదలయ్యాయి. వీటికి గిరాకీ చాలా ఎక్కువే ఉందని అమ్మకందారులు చెబుతున్నారు. ఒక్కో కోడి ధర రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది. స్థానిక పుంజుల కంటే ఇది చాలా తక్కువ ధర. ఉభయ గోదావరి జిల్లాలకు నెల్లూరు సింహపురి నుంచి కోడి పుంజులు వస్తున్నాయి. నెల్లూరు జిల్లాల్లో పెంచిన కాకి, నెమలి, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతుల కోడి పుంజులను గోదావరి జిల్లాల్లో అమ్ముతున్నారు. పందెం రాయుళ్లు ఆయా కోడి పుంజులను కొనుగోలు చేస్తున్నారు. సింహపురి కోడి పుంజులపై పందెం రాయుళ్లు ఆసక్తి చూపుతున్నారు. నెల్లూరు జిల్లా వ్యాపారులు రావుల పాలెం-ఏలూరు జాతీయ రహదారి, రద్దీ రోడ్ల వెంబడి కోడి పుంజులను అమ్మకాలు చేస్తున్నారు.సంక్రాంతి వచ్చిందటే ఉభయ గోదావరి జిల్లాల్లో గుర్తొచ్చేది కోడి పందాలే. తూర్పు గోదావరి జిల్లాలో మురమళ్ల, కాత్రేనికోన, వేట్లపాలెం, పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, వెంప, సీసలి, దుంపగడప ప్రాంతాలు కోడి పందేలకు పేరు పొందాయి. అయితే ఇవి కాకుండా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అన్ని ప్రాంతాల్లో కోడిపందాలు జోరుగా సాగుతాయి. పెద్ద బరుల్లో రోజుకు 20 నుంచి 30 పందాలు జరిగితే, గ్రామాల్లో జరిగే చిన్న వాటికి లెక్క ఉండదు. సంక్రాంతి మూడు రోజుల పాటు జరిగే వేలాది కోడి పందాలకు కోడి పుంజులు అవసరం అవుతాయి. అయితే ఉభయ గోదావరి జిల్లాల్లో సొంతంగా కోడి పుంజులను మేపడం, వాటికి పందాలను నేర్పడం వంటివి చేస్తారు. అయితే ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న కోడి పుంజులు సరిపోగా, ఇతర ప్రాంతాల నుంచి కోడి పుంజులను తెప్పిస్తారు. కోడిపందేల్లో రంగంలోకి దింపే భీమవరం బ్రీడ్ పుంజులకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. సంక్రాంతి కోడి పందేల కోసం ఉండి, ఆకివీడు, చెరుకుమిల్లి, చినమిరం, కాళ్ల, కోనసీమలోని అమలాపురం, లంక, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో భీమవరం బ్రీడ్ కోడిపుంజుల పెంచుతున్నారు. వీటి పెంపకంతో గోదావరి జిల్లాల్లో వందలాది మంది ఉపాధి కూడా పొందుతున్నారు. భీమవరం బ్రీడ్ పుంజులకు ఉన్న గిరాకీని దృష్టిలో పెట్టుకుని నెల్లూరులో కూడా కోళ్ల పెంపకం దారులు వీటినే అక్కడ పెంచుతున్నారు. నెల్లూరు భీమవరం బ్రీడ్ కోళ్లను పెంచి, ఉభయ గోదావరి జిల్లాల్లో తెచ్చి అమ్ముతున్నారు. ఇంకో నెల రోజుల్లో సంక్రాంతి పండగ రానుంది. నెల్లూరు జిల్లాకు చెందిన నాటుకోళ్ల పెంపకం దారులు, వ్యాపారులు అప్పుడే గోదావరి జిల్లాల్లో కోడి పుంజులను అమ్మేందుకు తీసుకొస్తున్నారు. ఒక్కొక్కరు 15 నుంచి 20 కోడి పుంజులను తెచ్చి అమ్ముతున్నారు. నలుగురైదుగురు బృందంగా ఏర్పాడి రావులపాలెం-ఏలూరు జాతీయ రహదారి వెంబడి, ఇతర రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో పందెం కోడి పుంజులను అమ్ముతున్నారు.పందెం కోళ్లలోని దాదాపు అన్ని రకాల జాతులు నెల్లూరు అమ్మకం దారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా పందేల కోసం గోదావరి జిల్లాల్లో సిద్ధం చేసిన పుంజులు చాలా ధర ఉంటాయి. పందెం పుంజులను కొత్త అల్లుళ్ల మాదిరిగా దిట్టంగా పెంచుతారు. వాటికి మూడు నెలల ముందునుంచే మటన్ కీమా, డ్రైఫ్రూట్స్, ఇతర బలాన్నిచ్చే ఆహారం అందిస్తుంటారు. శరీర బలంగా ఉండేందుకు వాకింగ్, ఈత కొట్టడించడం, పరిగెత్తించడం, నీళ్ల పోతలు, శాఖాలు తదితర రూపాల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. వాటికి అందించే ఆహారం, శిక్షణను బట్టి ఒక్కొక్క పుంజు ధర రూ.25 వేల నుంచి రూ. లక్ష కూడా దాటి పోతుంది. అదే నెల్లూరు పంజులు అంత భారీ ధరలు ఉండవు. చూడటానికి స్థానిక పుంజులకు ఏమాత్రం తీసిపోని విధంగా సైజులు, రంగుల్లో నెల్లూరు పుంజులు ఉంటాయి. పంజు రంగు, ఎత్తు, బరువును బట్టీ వాటి ధర రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు ఉంటుంది. దీంతో తక్కువ ధరకు రావడంతో పందెం రాయుళ్లు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాటి కాళ్ల సామర్థ్యం, ప్రత్యర్థిపై దాడి చేసే వేగాన్ని పరీక్షించేందుకు డింకీ పందేలు కట్టి బాగున్న కోడి పుంజులను బేరమాడి కొనుగోలు చేస్తున్నారు. నెల రోజుల పాటు వాటికి తగిన మేతను అందించి శిక్షణ ఇచ్చి కోడి పందెలకు సన్నద్ధం చేస్తారు.

# కొత్త ఆశలతో స్వాగతం

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):**
క్యాలెండర్ మారిపోయింది... కొత్త క్యాలెండర్ వచ్చేసింది.. కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టేశాం,,,. 2024కి వీడ్కోలు పలికి.. సరికొత్త ఆశలతో 2025ను ఆహ్వానించాము..గడిచిన క్షణాల నుంచి మంచిని తీసుకొని రాబోయే కాలం లో విజయాల వైపు నడిచేందుకు న్యూ ఇయర్ తీర్మానాల్లో భాగంగా వారి డైరీలో ప్రణాళికలు రాసుకుంటున్నారు.ఇప్పటి వరకు చేయాలనుకున్నవి చేయలేకపోవడానికి కారణాలను పరిశీలించుకొని ఇకపై వచ్చే రోజుల్లో అన్ని సక్రమంగా చేసుకునేలా తమ కు తాము సూచనలు చేసుకుంటున్నారు. కొందరు రోజూ ఉదయం వాకింగ్ చేయడం, ఇంకొందరు జిమ్‌కు వెళ్లడం, మరికొందరు పుస్తకాలు చదవడం, కొత్త భాషలు నేర్చుకోవడం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వడం తదితర లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొత్త ఏడాది.. కొత్తగా స్టార్ట్ చేయాలి. అలవాట్లు, అభిరుచుల విషయంలోనూ కొన్ని రిజల్యూషన్స్ తీసుకోవాలి. అప్పుడే మన జీవితం కూడా కొత్తగా ఉంటుంది. వ్యక్తిగతంగానూ కొన్ని విషయాల్లో నియమాలు పెట్టుకోవాలి. లేదంటే కొత్త అనుకుంటూనే పాత రోతలోనే మిగిలిపోతాం. అందుకే మీలోని చెడును వదిలిపెట్టేయాలనే నియమం పెట్టుకోండి. రాబోయే ఏడాది దాన్ని సాధించడం కోసం కష్టపడాలి. వాటిని ఏదో రెండు మూడు రోజులు కాకుండా.. మీ మాటే శాసనంగా నిరంతరం ఫాలో అయితే మీకు మంచిది. మీ న్యూ ఇయర్ రిజల్యూషన్స్ మీ వ్యక్తిగత వృద్ధి కోసమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడేలా చూసుకోండి.మీ ప్రియమైనవారితో మీ సంబంధాలను పెంచుకోండి. వారికి ప్రాధాన్యం ఇవ్వండి. మీకు విలువ ఇస్తున్నారు కదా అని వారిని లైట్ తీసుకోకండి. మీ కుటుంబం, స్నేహితులు లేదా సహోద్యోగులు కావచ్చు. వారితో మంచి రిలేషన్ ఏర్పరచుకోవడానికి సమయాన్ని, కృషిని పెట్టుబడిగా పెట్టడానికి ప్రయత్నించండి. ఇది మీ బంధాన్ని బలోపేతం చేస్తుంది. మీ మానసిక శ్రేయస్సుకు సానుకూలంగా దోహదం చేస్తుంది. కొత్త విషయాలను అన్వేషించడానికి, ప్రయత్నించడానికి, కొత్త అనుభవాలను పొందడానికి ట్రై చేయండి. ఇది జీవితానికి గొప్ప అనుభవాన్ని అందిస్తుంది. కంఫర్ట్ జోన్‌ను దాటి కొత్తదనం కోసం తలుపులను తెరిచి ఉంచండి. కొత్త అభిరుచిని





కనుగొనండి. కొత్త విషయాలు తెలుసుకోండి. దానికోసం రీసెర్చ్ చేయండి. ఇది మీకు సబ్జెక్ట్ పెరిగేలా చేస్తుంది. అప్పుడు మీ మీద మీకు నమ్మకం పెరుగుతుంది.ఈ ఆధునిక జీవితంలో పర్యావరణంపై ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. ప్రయత్నం చిన్నదైనా పర్యావరణంపై శ్రద్ధ పెట్టడం చాలా అవసరం. అలాగే మీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను మంచి కోసం ఉపయోగించండి. ఆన్‌లైన్‌లో ఉన్నవన్నీ నిజం కాదని గుర్తుంచుకోండి. అందులోని మంచిని మాత్రమే స్వీకరించాలి. మంచి కంటెంట్‌ను మాత్రమే షేర్ చేయండి. వీలైతే సోషల్ మీడియా తక్కువగా వాడండి.జీవితంలో ఎల్లప్పుడూ ఆరోగ్యమే మీ ప్రాధాన్యతగా ఉండాలి. వచ్చే ఏడాది సమతుల్యమైన, మరింత అనుకూలమైన జీవనశైలిని అనుసరించడానికి ప్రయత్నించండి. వ్యాయామం కోసం ఓ అరగంట కేటాయించండి. మీ మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. ఇది మీ శరీరంలో శ్వాస నియంత్రణ, జ్ఞాపకశక్తి మెరుగుపరుస్తుంది. అలాగే ఆర్థికంగా నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇందుకోసం ఖర్చులను తగ్గించుకోండి. కష్టపడి పని చేయాలి, లక్ష్యాల కోసం నిజాయితీగా ప్రయత్నించాలి. వ్యూహాత్మక ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలి. కుటుంబ సభ్యుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా పొదుపు, ఖర్చు గురించి తెలియజేయండి.

కొన్ని స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. సంపద పెరుగుతుందనుకునే విషయాల్లో పెట్టుబడులు పెట్టండి.మరో ముఖ్యమైన విషయం కొత్త ఏడాది అంటే పార్టీలు మాత్రమే కాదు. మత్తులో ఊగిపోవడం అంతకన్నా కాదు. రాబోయే ఏడాది జీవితం ఎంత అందంగా ఉండాలని మీరు కోరుకున్నా? మీ చుట్టూ ఉన్న పరిస్థితులు అందుకు దోహదపడాలి. చుట్టూ చీకట్లు అలముకుని ఉంటే మీరొక్కరే వెలుగులో బతకడం అసాధ్యం. కనుక సమాజాన్ని పట్టిపీడుస్తున్న అంధకారాన్ని పారద్రోలడం కూడా మన లక్ష్యాల్లో ఓ భాగంగా ఉండాలి. ఈ ఏడాదిలోనైనా ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేస్తామంటూ.. సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెడుతుండటం విశేషం.

# జనసేన కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు

- కేక్ కట్ చేసిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు

**విజయనగరం,జనవరి1( వెలుతురు):**
నూతన సంవత్సరం-2025లో జిల్లా ప్రజలంతా సుఖః సంతోషాలతో ఉండాలని జనసేన నాయకులు అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన దంపతులు ఆకాంక్షించారు. విజయనగరం బాలాజీ నగర్ లోని జనసేన కార్యాలయంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో అవనాపు విక్రమ్ భావన పాల్గొని కేక్ కట్ చేసి, వీర మహిళలు, జనసైనికులు, అభిమానులకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ మనం ఇప్పుడు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నప్పటికీ ఆరు నెలల క్రితమే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం ద్వారా నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ఆరునెలలుగా అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కనులుగా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అడుగులు ముందుకు వేస్తున్నారని అన్నారు. జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్ని జిల్లాలలో పర్యటన చేస్తామని, అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించడం 2025 వ నూతన సంవత్సరంలో శుభపరిణామమని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల్లో ఉండడం, అధికారంలో




ఉన్నప్పుడు ప్రజలకు దూరంగా జరగడం కాదని, నాయకుడు నిత్యంలో ప్రజల్లో ఉండాలని పవన్ కళ్యాణ్ సంకల్పించడం గొప్ప అంశమని అన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పని చేయడం గొప్ప అవకాశమని, వీరమహిళలు, జనసైనికుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఆనందగా ఉందని అవనాపు విక్రమ్ అన్నారు. జిల్లాలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపిన డాక్టర్ అవనాపు భావన , ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్టాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా అంతా కలసి కట్టుగా పనిచేసి, రాష్ట్రాభివృద్ధిలో బాగస్వాములు కావాలని భావన కోరారు. కార్యక్రమంలో వీర మహిళలు, జనసైనికులు, అవనాపు అభిమానులు పాల్గొని భావన విక్రమ్ దంపతులకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు.

## ఎయిరిండియా విమానాల్లో వైఫై సౌకర్యం

- అందుబాటులోకి తెచ్చిన టాటా గ్రూపు




న్యూఢిల్లీ,జనవరి1( వెలుతురు) :
టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా వైఫై ఇంటర్నెట్ సర్వీసులకు శ్రీకారం చుట్టింది. దేశీయ, విదేశీ విమాన సర్వీసుల్లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 787–9తో పాటు ఎంపిక చేసిన ఏ321 నియో విమానాల్లో ఈ సేవలు లభిస్తాయి. దేశీయంగా ఈ తరహా సేవలందిస్తున్న తొలి విమాన సంస్థ తమదేనని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ మార్గాల్లో నడుస్తున్న ఎయిర్‌బస్ ఏ350, ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బి787–9 ఎయిర్ క్రాఫ్ట్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎయిరిండియా వైఫై సేవలను అందిస్తోంది. దీనికి కొనసాగింపుగా దేశీయంగానూ ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. ల్యాప్‌టాప్, టాబ్లెట్లు, ఐఓఎస్, ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వంటి డివైజుల్లో ఈ వైఫై సేవలను ఆనందించొచ్చు. విమానం 10 వేల అడుగుల ఎత్తుకు చేరాక ఈ సేవలు లభిస్తాయి. ఒకేసారి పలు డివైజులను వైఫైకి కనెక్ట్ చేయొచ్చు. తొలుత కాంప్లిమెంటరీగా ఈ సేవలు లభిస్తాయని, త్వరలో మరిన్ని విమానాల్లోనూ ఈ సేవలను ప్రారంభించనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

## షరతుల పేరుతో రైతుల నోట్లో మట్టికొట్టే యత్నం

- రైతుభరోసాపై హరీష్ రావు విమర్శలు

సంగారెడ్డి,జనవరి1( వెలుతురు):
షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు.రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి. వానాకాలం, యాసంగి పంటలకు కలిపి ఒకేసారి రూ.15వేల చొప్పున ఇవ్వాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## గంజాయి సరఫరాచేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రైల్వే పోలీసుల వెల్లడి

హైదరాబాద్,జనవరి1( వెలుతురు):
ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్రకు రైలులో సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నారని సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జావీద్, రైల్వే పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు వివరాలను వెల్లడించారు. ఒడిశా(క్షటతిబరజీ)లోని గాజపాటి జిల్లా ఘూసాపాడ గ్రామానికి చెందిన సర్బన్ నాయక్ (29) ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తాడు. అదే గ్రామానికి చెందిన తఫాన్ బిషోయో (27)తో పాటు మానస్ ఒడిశాలో రూ.1.22 లక్షల విలువ చేసే 4.9 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడినుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు(ఐనినిజీసీ ఇలూస।బబ బిసజీతిని)లో సరఫరా చేస్తుండగా మంళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బెర్తు కింద ఉన్న లగేజీలను పరిశీలించగా అందులో గంజాయి సరుకు ఉందని తెలుసుకున్న పోలీసులు ముందుగా సర్బన్ నాయక్, తఫాన్ బిషోయోలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులను గమనించిన మానస్ అక్కడి నుంచి పారిపోయాడు. గంజారుని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యలపరిష్కారం కోసం వస్తారు

- ఓట్లు మాత్రం వేయడం లేదు
- నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే

ముంబై, జనవరి1( వెలుతురు):



ప్రజలు సమస్యలు వచ్చినప్పుడు పరిష్కారంకోసం తమ పార్టీ వైపు చూస్తారని, ఎన్నికల్లో ఓటింగ్ సమయంలో మాత్రం విస్మరిస్తున్నారని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే అన్నారు. మహారాష్ట్ర ప్రజలకు వరుస ట్వీట్లలో ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ముంబైలో గత 25 ఏళ్లుగా మార్పులు వచ్చినప్పటికీ ఇప్పటికీ ఉద్యోగావకాశాలు లేవనే అభద్రతా భావంతో ప్రజలు ఉన్నారని రాజ్ ఠాక్రే చెప్పారు. యువకులకు చేసేందుకు పని లేదని, ఇదే సమయంలో రాష్ట్రం బయట నుంచి వచ్చిన వారికి ఉద్యోగావకావశాలు లభిస్తున్నాయని అన్నారు. కార్మికుల నుంచి రైతులు, పేదల వరకు చుక్కలనంటుతున్న ధరలతో కుదేలవుతున్నారని అన్నారు. ఇలాంటి సందర్భాల్లోనూ, ఇతర సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు మహారాష్ట్ర నవనిర్మాణ సేవ గుర్తొస్తుందని, కానీ ఎన్నికల్లో ఓటింగ్ సమయంలో మాత్రం పార్టీని విస్మరిస్తున్నారని అన్నారు. ఞాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఇప్పటికీ తాము విశ్లేషించు కుంటున్నామని, త్వరలోనే పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశర చేస్తామని చెప్పారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 125 మంది అభ్యర్థులను ఎంఎన్‌ఎస్ పోటీకి దింపింది. అయితే ఒక్క సీటు కూడా పార్టీ గెలుచుకోలేదు. 1.55 శాతం ఓటింగ్ షేర్ రాబట్టుకుంది. మహిం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ కేవలం మూడో స్థానంలో నిలిచాడు. ఎన్నికల ఫలితాలు నమ్మశక్యంగా లేవని రాజ్ ఠాక్రే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంఎన్‌ఎస్ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 13 సీట్లు గెలుచుకుంది. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక్కో స్థానం దక్కించుకుంది. ఈసారి ఖాతా కూడా తెరవలేదు.

# భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం భారతరత్న

- భారతరత్న పురస్కారం స్థాపించబడింది ఈరోజే (జనవరి 2, 1954)

న్యూఢిల్లీ,జనవరి1( వెలుతురు) :
భారతరత్న పురస్కారం భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత స్థాపించబడింది. ఈ పౌర పురస్కారం కళ, సాహిత్య, విజ్ఞాన, క్రీడా రంగాలలో అత్యుత్తమ కృషికి ప్రదానం చేస్తారు. ఇప్పటివరకు నలభై మందికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వారిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ పురస్కారం 1977 జూలై 13 నుండి 1980 జనవరి 26 వరకు జనతా పార్టీ పాలనలో కొద్దికాలం పాటు నిలిపివేయబడింది. ఒకే ఒక్కసారి 1992లో సుభాష్ చంద్రబోస్కు ఇవ్వబడిన పురస్కారం చట్టబద్ధ సాంకేతిక కారణాల వల్ల వెనుకకు తీసుకొనబడింది.




ఎలాంటి జాతి, ఉద్యోగం,స్థాయి లేదా స్త్రీ పురుష వ్యత్యాసం లేకుండా ఈ పురస్కారం ఇవ్వబడుతుంది. ఈ పురస్కారగ్రహీతల జాబితాను ప్రధానమంత్రి రాష్ట్రపతికి సిఫారసు చేయవలసి ఉంటుంది.

భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది (మొదటిది ఆరూ– రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్లు, మాజీ రాష్ట్రపతులు, ఉపప్రధాన మంత్రి, ముఖ్య న్యాయాధీశులు). కానీ ఈ గౌరవం వలన ఎలాంటీ అధికారాలు లేదా పేరు ముందు ప్రత్యేక బిరుదులూ రావు.

ఈ పురస్కారం పొందిన విదేశీయుల జాబితాలో సరిహద్దు గాంధిగా పేరుపొందిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ (1987), నెల్సన్ మండేలా (1990) ఉన్నారు.

1954, జనవరి 2వ తేదీన రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు భారత రాష్ట్రపతి యొక్క కార్యదర్శి కార్యాలయం నుండి ఒక ప్రకటన జారీ అయ్యింది. వాటిలో మొదటిది అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న కాగా రెండవది దానికన్నా తక్కువ స్థాయి గల మూడంచెల పద్మవిభూషణ్ పురస్కారం. పద్మవిభూషణ్ పురస్కారం ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గాలుగా విభజించారు. 1955, జనవరి 15న పద్మవిభూషణ్ పురస్కారాన్ని పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు వేర్వేరు పురస్కారాలుగా పునర్వర్గీకరించారు.

భారతరత్న పురస్కారం కేవలం భారతీయులకే ప్రదానం చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ఈ పురస్కారాన్ని భారత పౌరసత్వం స్వీకరించిన మదర్ థెరీసాకు 1980లో, మరో ఇద్దరు విదేశీయులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌కు 1987లో, నెల్సన్ మండేలాకు 1990లో ప్రదానం చేశారు. ప్రఖ్యాత క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్‌కు తన 40వ యేట ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం లభించినవారిలో ఇతనే అతి పిన్నవయస్కుడు, మొట్టమొదటి క్రీడాకారుడు. సాధారణంగా భారతరత్న పురస్కార ప్రదాన సభ రాష్ట్రపతి భవన్, ఢిల్లీలో జరుగుతుంది. కానీ 1958, ఏప్రిల్ 18వ తేదీన బొంబాయిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధోండో కేశవ కర్వేకు అతని 100వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఇతడు జీవించి ఉండగా ఈ పురస్కారం అందుకున్నవారిలో అతి పెద్ద వయస్కుడు. 2015 నాటికి ఈ పురస్కారాన్ని మొత్తం 45 మందికి అందజేయగా వారిలో 12 మందికి మరణానంతరం లభించింది.

చరిత్రలో ఈ పురస్కారం రెండుసార్లు రద్దు చేయబడింది. మొదటి సారి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 1977, జూలై 13వ తేదీన అన్ని పౌరపురస్కారాలను రద్దుచేశారు. తరువాత ఈ పురస్కారాలు 1980, జనవరి 25న ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత పునురుద్ధరించబడ్డాయి. 1992లో ఈ పురస్కారాల "రాజ్యాంగ సాధికారత"ను సవాలు చేస్తూ కేరళ, మధ్యప్రదేశ్ హైకోర్టులలో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ పురస్కారాలను రెండవసారి రద్దు చేశారు. ఈ వ్యాజ్యాలకు ముగింపు పలుకుతూ 1995 డిసెంబరులో సుప్రీం కోర్టు ఈ పురస్కారాలను మళ్ళీ పునరుద్ధరించింది. ఇప్పటివరకు 54 మందికి భారతరత్న అవార్డు ప్రధానం చేశారు.

# ఒక్కరోజులో 402 కోట్ల మద్యం విక్రయం..

- ఎక్సైజ్ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డ్ అమ్మకం
- ఐదు రోజుల్లో రూ.1800 కోట్ల ఆర్జన లక్ష్యం..
- 30, 31 తేదీల్లో 1000 కోట్ల సరుకు సరఫరా
- 30వ తేదీ నాటికే రూ. 3,523 కోట్ల ఆదాయం

హైదరాబాద్, జనవరి1( వెలుతురు):
రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నది. దీంతో రాష్ట్ర ఖజానాకు రాబడి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నది. ఎక్సైజ్‌శాఖ చరిత్రలోనే రికార్డు స్థాయిలో మద్యం విక్రయించినట్టు తెలుస్తున్నది. ఒక్కరోజులో సుమారు రూ.403 కోట్ల మద్యం విక్రయించి.. ఎక్సైజ్‌శాఖ రికార్డు నెలకొల్పింది. గడిచిన ఐదు రోజుల్లో మద్యం షాపుల నుంచి బెల్ట్‌షాపుల వరకూ కోట్ల విలువైన మద్యాన్ని చేరవేశారు. డిసెంబర్ 28 నుంచి జనవరి ఒకటి వరకు కేవలం 5 రోజుల్లోనే రూ.1,800 కోట్ల వరకు ఆర్జించాలన్న లక్ష్యానికి చేరువలో ఎక్సైజ్‌శాఖ ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. గతంతో పోల్చితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతున్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భాన్ని ఉపయోగించుకొని భారీగా మద్యం విక్రయాలు జరుపాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆబ్కారీ అధికారులు వ్యూహాన్ని రూపొందించారు. అందులో భాగంగా ఆయా మద్యంషాపులకు ఇప్పటికే భారీగా మద్యం చేరగా, అక్కడి నుంచి బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ఎక్సైజ్‌శాఖ నుంచి బెల్ట్‌షాపులకు ఎలాంటి షరతులు విధించకపోవడంతో.. 31, జనవరి 1వ తేదీల్లో వాటి నిర్వాహకులు లక్షల రూపాయలు అమ్మకాలు జరిపారు. సంవత్సరం చివరి రెండు రోజుల్లో తెలంగాణ గ్రామాలు, పట్టణాల్లోని దాదాపు ప్రతి గల్లీలో మద్యాన్ని సమృద్ధిగా అందుబాటులో ఉంచారు. ఇక మిగిలిన జనవరి 1వ తేదీన కూడా భారీగా మద్యం విక్రయించేందుకు పథకం ప్రకారం ఏర్పాట్లు చేశారు.




30న రూ.402.62 కోట్ల మద్యం విక్రయం: ఏడాదికి 7–8 సార్లు మద్యం డిపోల నుంచి సరుకును లిఫ్ట్ చేసే వెలుసుబాటు కల్పించారు. ఆ పరిమితి దాటిన వారికి ప్రభుత్వం కల్పించిన 'ప్రత్యేక అనుమతి'తో రసీదులు ఇచ్చి మరీ మద్యాన్ని లోడ్ చేసినట్టు తెలిసింది. దీంతో 30వ తేదీన ఒక్కరోజే మద్యంపై వచ్చిన ఆదాయం అక్షరాల రూ.402.62 కోట్లు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా 3,82,265 లికర్ కేసులు, 3,96, 114 బీర్ కేసులు అమ్మడైనట్టు తెలిసింది. చలికాలంలో కూడా లిక్కర్ కంటే బీర్లే అత్యధికంగా అమ్ముడుపోవడటం విశేషం. 31 రాత్రికి మద్యం కొనుగోళ్లు మరింత భారీగా పెరిగినట్టు సమాచారం. తెలంగాణలో మద్యం కొనుగోళ్లు ఊపందుకోగా, వ్యాపారస్తులలో కూడా జోష్ పెరిగింది.

30 నాటికే 3,523.16 కోట్ల ఆదాయం: ఏటా డిసెంబర్ వచ్చిందంటే చాలు.. ఆ జోష్ వేరే కనిపిస్తుంది. డిసెంబర్ 26 నుంచి జనవరి 1 వరకు 'న్యూ ఇయర్ వీక్'లో గ్లాసులు గలగలలాడాల్సిందే. అందుకే ఎక్సైజ్‌శాఖకు డిసెంబర్ ఎంతో కీలకం. అయితే, ఈ డిసెంబర్ 30 నాటికే ఆబ్కారీ శాఖకు రూ.3,523.16 కోట్ల ఆదాయం సమకూరింది. 2023 డిసెంబర్‌లో 31 వరకూ ఎక్సైజ్‌శాఖకు మద్యం అమ్మకాలు, వ్యాట్‌తో కలిపి వచ్చిన ఆదాయం రూ.3,333 కోట్లు కాగా.. ఈ సారి 30వ తేదీ నాటికే రూ.3,523.16 కోట్లు సమకూరాయి. ఇక 31వ తేదీన వచ్చిన లాభాలు అదనం. ముందస్తు ప్రణాళిక ప్రకారం మద్యం షాపులకు, వాటి నుంచి బెల్ట్‌షాపులకు మద్యం చేరవేయడంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు సఫలీకృతయ్యారని అంటున్నారు. నాడు తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని, బెల్ట్‌షాపులు ఎత్తివేయిస్తామ ని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు ఖజానా నింపేందుకు దానిపైనే ఆధారపడటంపై అంతా ముక్కు న వేలేసుకుంటున్నారు.

# ఉపాధి పథకంలో తక్కువ వేతనాలు

- పార్లమెంటరీ కమిటీ పెదవి విరుపు
- పనిదినాలు పెంచాలని సూచన
- వేతనాలు సవరించాలని సిఫారసు

న్యూఢిల్లీ జనవరి1( వెలుతురు):
మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కార్మికుల వేతనాలు సవరించాలని, వాటిని ద్రవ్యోల్బణ రేటుకు అనుగుణంగా ధరల సూచీతో అనుసంధానం చేయాలని సూచించింది. గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటు చేసిన కమిటీ ఉపాధి హామీ పథకం వేతన రేటుపై ఇటీవల లోక్‌సభకు తన నివేదికను అందజేసింది. పథకంలో కనీస పనిదినాలను 100 నుంచి 150కి పెంచాలని కూడా కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలకా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది.2006లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2011–12 వరకూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన కనీస వేతనాల ఆధారంగానే వేతన రేటును నిర్ణయించారు. 2011–12 నుంచి వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీ (సిపిఐ–ఎఎల్)ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వమే వేతన రేట్లను నిర్ణయించడం మొదలు పెట్టింది. ఈ సూచీ ఆహార వస్తువులకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అయితే గ్రామీణ ప్రాంత వినియోగ ధరల సూచీ (సిపిఐ %–% రూరల్) ఆధారంగా కార్మికుల వేతనాలను నిర్ణయిస్తే సబబుగా ఉంటుందని 2015లో ఆర్థికవేత్త మహేంద్ర దేవ్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ, 2018లో గ్రామీణాభివృద్ధి శాఖ సీనియర్ అధికారి నగేష్ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన మరో కమిటీ అభిప్రాయపడ్డాయి. ద్రవ్యోల్బణ ప్రభావం నుండి ఈ సూచీ వేతనాలకు రక్షణగా నిలుస్తుందని తెలిపాయి. ఆహార, ఇతర



సేవలపై పెట్టే వ్యయాలకు ఈ సూచీ సమాన ప్రాధాన్యత ఇస్తుందని చెప్పాయి.ఏ పనికైనా రోజుకు కనీసం రూ.375 వేతనం ఇవ్వాలని 2018లో కార్మిక ఆర్థికవేత్త అనూప్ శతపతి నేతృత్వంలో ఏర్పడిన కమిటీ సిఫారసు చేసింది. కాగా ఉపాధి పథకం కార్మికులకు ప్రస్తుతం నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా ఆలస్యంగా అందుతున్నాయని పార్లమెంటరీ కమిటీ ఎత్తిచూపింది. కార్మికుల వలసలకు ఇది కూడా ఓ కారణమని తెలిపింది.ప్రతి కుటుంబానికీ ఏడాదికి కనీసం 150 పనిదినాలు కల్పించాలన్న పౌర సమాజ బృందాల డిమాండుకు కమిటీ గతంలోనే మద్దతు తెలిపింది. పనిదినాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇచ్చామని గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలియజేసింది. అయితే అదనపు పనిదినాలకు చెల్లించే వేతనాల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది. ఈ సమాధానంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్ట సవరణ ద్వారా పనిదినాలను పెంచి, ఆ నిబంధనను దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వర్తింపజేయాల్సింది గ్రామీణాభివృద్ధి శాఖేనని స్పష్టం చేసింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని తప్పనిసరి చేయకూడదని, దానికి బదులు ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని రూపొందించాలని కూడా కమిటీ సూచించింది.

# కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన సినీ ప్రముఖులు



కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ టాలీవుడ్ అగ్ర నటులు సోషల్ మీడియా వేదికగా అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త ఏడాది సందర్భంగా.. 2024కి వీడ్కోలు చెబుతూ.. 2025కి స్వాగతం.. ఈ కొత్త సంవత్సరం మరింత ప్రకాశవంతంగా విస్తరించాలని, కొత్త ఆశలు, ఆకాంక్షలు సాకారం చేసుకునే శక్తిని అందివ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భారతీయ సినిమా వైభవం మరింత ప్రకాశవంతంగా విస్తరించాలి. కొత్త సంవత్సరమంతా ప్రేమతో కలిసిమెలిసి ఉంటూ అందరితో ఆనందాన్ని పంచుకోవాలని కోట్లాదిమంది అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రెగొరియన్ క్యాలెండర్ ప్రకారం మొదలవుతోన్న నూతన సంవత్సరం సందర్భంగా ప్రతిఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నటుడు పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ.. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నా అభిమానులందరికీ హ్యాపీ న్యూ ఇయర్. లవ్ యూ ఆల్ అంటూ రాసుకోచ్చాడు. నూతన సంవత్సర శుభాకాంక్షలు.. ఈ ఏడాది మరింత ఆనందాన్ని, విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా అంటూ ఎన్టీఆర్ రాసుకోచ్చాడు.

## పుట్టపర్తి సాయిబాబా సన్నిధిలో సాయి పల్లవి

కొత్త ఏడాది సందర్భంగా అందరూ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో మునిగితేలుతుంటే సాయి పల్లవి మాత్రం ఆధ్యాత్మికం వైపు వెళ్లింది. కొత్త సంవత్సరం కానుకగా.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబాను దర్శించుకుంది సాయి పల్లవి. కుటుంబంతో కలిసి పుట్టపర్తికి వెళ్లిన సాయిపల్లవి ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం బాబా నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మికతను చాటుకుంది. ఈ సందర్భంగా పట్టుచీరలో సంప్రదాయంగా మెరిసి ఆకట్టుకుంది. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## నేడు గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్

రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయంరానే వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా జనవరి 02 సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకుంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియార అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.




# కొత్త సంవత్సరంలో అలరించనున్న సినిమాలు ఇవే

కొత్త సంవత్సరం కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో వచ్చేసింది. అయితే 2024 ఏడాది సినిమా ప్రేక్షకులకు మంచి అనుభవాలను నింపి వెళ్లిన విషయం తెలిసిందే. గుంటూరు కారంతో మొదలైన కొత్త ఏడాది.. ఆ తర్వాత హన్ మాన్, కల్కి, సరిపోదా శనివారం, లక్కీ భాస్కర్, పుష్ప 2 ది రూల్ వంటి సినిమాలతో మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

అయితే ఈ ఏడాది కూడా పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలు అలరించబోతున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో బాక్సాఫీసు ముందుకు రానున్న చిత్రాలేవో చూసేద్దాం. ఈ ఏడాది టాలీవుడ్‌లో తెలుగు సినిమా కాకుండా ఒక మలయాళం డబ్బింగ్ చిత్రం బోణీ కొడుతుంది. మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం మార్కో. హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. 5 రోజుల్లో రూ.50 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను తెలుగులో జనవరి 01న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు మేకర్స్. మలయాళ నటుడు టొవినో థామస్, సౌత్ క్వీన్ త్రిష ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం 'ఐడెంటిటీ'. అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. ఈ చిత్రం జనవరి 02న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**గేమ్ ఛేంజర్**

ప్రతి సంక్రాంతిలాగే ఈ సంక్రాంతి కూడా రసవత్తరంగా సాగబోతుంది. జనవరి 10న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో మొదలవ్వనున్న ఈ పోటీ తర్వాత వెంకటేశ్, బాలకృష్ణతో పాటు డబ్బింగ్ సినిమాలు రానున్నాయి. రామ్ చరణ్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్‌ఆర్‌ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.




**'డాకు మహారాజ్'**

గేమ్ ఛేంజర్ వచ్చిన రెండు రోజులకే బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడానికి 'డాకు మహారాజ్' అంటూ వస్తున్నాడు బాలయ్య. బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న ఈ యాక్షన్ డ్రామాలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటిస్తుండగా.. 'వాల్తేరు వీరయ్య' సినిమాతో 2023 సంక్రాంతికి హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

**సంక్రాంతికి వస్తున్నాం**

సంక్రాంతి రేసులో ఉన్న మరో పెద్ద సినిమా సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేశ్‌కి ఎఫ్2, ఎఫ్ 3 వంటి సూపర్ హిట్లు అందించిన దర్శకుడు అనిల్ రావిపుడి మరోసారి జతకట్టిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇవే కాకుండా హిందీ నుంచి కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' సినిమాని జనవరి 17న తీసుకురాబోతుండగా.. సోనూసూద్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న 'ఫతేహ్' జనవరి 10న రిలీజ్ కానుంది.

## ముద్దులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన సోనాక్షి దంపతులు




బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా దంపతులు 2025 సంవత్సరానికి వినూత్న రీతిలో స్వాగతం పలికారు. ముద్దుల్లో మునిగిపోతూ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన వీడియోను సోనాక్షి కపుల్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆ వీడియోలో సోనాక్షి సిన్హా అభిమానులను ఉద్దేశంచి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు అని చెబుతూ కనిపిస్తుంది. ఆ తర్వాత తన భర్త జహీర్ ఇక్బాల్ చెంపపై ముద్దు పెట్టింది. ఈ సమయంలో వారి వెనుక న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి ఫైర్ క్రాకర్స్ పేలుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వేడుకలను వీక్షిస్తూ సోనాక్షి మరోసారి భర్త మెడపై ముద్దుపెట్టగా.. అందుకు స్పందనగా జహీర్ కూడా సోనాక్షి తల నిమురుతూ ముద్దులు పెట్టాడు. ఈ వీడియోను సోనాక్షి దంపతులు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. 'హమారా హ్యాప్పీ న్యూ ఇయర్ హెూగయా.. హ్యాప్పీ న్యూ ఇయర్ ఫ్రమ్ సిడ్నీ అనే క్యాప్షన్ ఇచ్చారు.

## నాని సినిమాలో విషాదం

**గుండెపోటుతో మృతి చెందిన అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్**



నాని హీరోగా నటిస్తున్న 'హిట్ 3' షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ జమ్మూ కాశ్మీర్, శ్రీనగర్‌లో జరుగుతోంది. ఈ సినిమాకు అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్న కె.ఆర్.క్రిష్ణ అనే మహిళా గుండెపోటుతో మృతి చెందారు. ఆమె వయసు 30 సంవత్సరాలు. కేరళలో పుట్టిన ఆమె సినిమాలపై ఉన్న మక్కువతో సినిమాటోగ్రాఫర్ పని చేస్తున్నారు. క్రిష్ణ మరణం పట్ల సినీ బృందం నివాళులు అర్పించింది.

## షూటింగ్ షురూ..

**ఎస్ఎస్ రాజమౌళి, మహేష్‌బాబు కాంబో భారీ సినిమా**

సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే! ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతోంది అయితే. సినిమా సెట్స్ మీదకు ఎప్పుడు వెళుతుంది? అని ప్రేక్షకులంతా ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వాళ్లందరికీ గుడ్‌న్యూస్ అందింది. జనవరి 2వ తేదీ, గురువారం నాడు పూజా కార్యక్రమాలతో మహేష్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఉదయం పది గంటలకు ఓపెనింగ్ జరుగుతుంది. మామూలుగా తన సినిమా ప్రారంభోత్సవానికి మహేష్ బాబు హాజరు కారు. మరి ఈ సినిమాకు వస్తాడా లేదా అన్నది చూడాలి. ఈ కార్యక్రమానికి పరిశ్రమలో ప్రముఖులతోపాటు వంద మందికి పైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. 'ఆర్ఆర్ఆర్' సినిమా చిత్రీకరణలో కొంత భాగం అల్యూమినియం ఫ్యాక్టరీలోనే షూటింగ్ చేశారు. ఆ సమయంలోను రాజమౌళి ఆఫీస్ అక్కడే ఏర్పాటు చేశారు. బాహుబలి కోసం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ చేసినప్పుడు తన ఆఫీసును అక్కడే ఏర్పాటు చేశారు రాజమౌళి. ఇప్పుడు కూడా అంతే... అల్యూమినియం ఫ్యాక్టరీలో మహేష్ బాబు సినిమా షూటింగ్ కొంత చ్టేసలా ప్లాన్ చేస్తున్నారు. అందుకని ఆఫీస్ అక్కడ ఏర్పాటు చేశారు. సుమారు ఏడాదిగా అక్కడ ఈ సినిమా పనులు చేస్తున్నారని సన్నిహితుల నుంచి సమాచారం. ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఆఫ్రికాలో జరగనుంది. కొన్ని రోజుల క్రితం కెన్యాలోని అంబోసెలి నేషనల్ పార్క్ వెళ్లిన రాజమౌళి, లొకేషన్ రెక్కీ నిర్వహించి వచ్చారు. ఆయనతో పాటు తనయుడు ఎస్ఎస్ కార్తికేయ కూడా ఉన్నారు. ఇప్పుడు ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ ఆఫ్రికాలో ప్లాన్ చేస్తున్నారు. కెన్యాతోపాటు సౌత్ ఆఫ్రికాలోని కొన్ని లొకేషన్లలో కూడా షూటింగ్ చ్టేస అవకాశం ఉందని తెలిసింది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# కూటమి ప్రభుత్వంతో భవిష్యత్‌పై భరోసా

- తప్పుచేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- 2024 చరిత్ర తిరగరాసిన సంవత్సరం
- అమరావతితో సినిమా రంగానికి మంచిరోజులు
- మీడియా ఇష్టాగోష్టిలో సిఎం చంద్రబాబు





**అమరావతి,జనవరి1( వెలుతురు):**
ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉంది. ప్రజల ఆలోచనలు, అవసరాల మేరకు పాలనా విధానాలను మార్చుకుంటున్నాం. అధికారులు కూడా ప్రజల ఆకాంక్షల మేరకు పనితీరు మార్చుకోవాలని సిఎం చంద్రబాబు అన్నారు. 2024.. చరిత్ర తిరగరాసిన సంవత్సరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లు ప్రజలు పడిన ఇబ్బందులకు విముక్తి కలిగిందని, ఇదే సమయంలో మీడియా కూడా ఇబ్బంది పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందరికీ భవిష్యత్తుపై భరోసా వచ్చిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కొందరు అధికారులు జగన్ మాటలు విని పనిచేశారని పేర్కొన్నారు. జగన్.. చివరకు అధికారులను కూడా గత ఐదేళ్లు బురద గుంతలో తోసేశారని విమర్శించారు.' ఎమ్మెల్యేలకు దశలవారీగా కౌన్సిలింగ్ ఇస్తున్నా. తప్పుడు పనులు చేయొద్దని వారిని పదేపదే హెచ్చరిస్తున్నా. సమాజానికి హానికరమైన వారిని మాత్రం వదిలేది లేదు. గతంలో రౌడీయిజం, మతకలహాలను అణచివేసినట్లే ఇప్పుడూ చేస్తాను. కొన్ని అంశాల్లో పార్టీ శ్రేణులు, నా అభిప్రాయాల్లో తేడా ఉంటోంది. కొందరు కార్యకర్తలు తమ అజెండాను నేను అమలు చేయాలని అనుకుంటున్నారు. జగన్ మాదిరిగా మేమూ తప్పులు చేస్తే ఎలా.. ప్రజలన్నీ గమనిస్తూనే ఉంటారు. నాకు నా ప్రజలే హైకమాండ్. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు. గత విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నాం అన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంతోనే.. ప్రత్యర్థులకు సరికొత్త వార్నింగ్ ఇచ్చారు. ఇక ఆట మొదలైందని.. ఎవరినీ వదిలిపెట్టబోనని స్పష్టమైన ప్రకటన చేశారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. తాను జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే కొంతమందికి మిసరబుల్ ట్రీట్‌మెంట్ ఉంటుందని అన్నానని గుర్తు చేశారు. ఆ మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. అయితే, తాను రాజకీయ కక్ష తీర్చుకోబోనని.. తప్పు చేసిన వారిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. 1995 సీఎంను త్వరలో మీరే చూస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఇక గేమ్ స్టార్ట్ అయ్యింది. సోషల్ మీడియా వ్యవహారంలో మీరు చూశారు కదా. మిగతా కేసులు కూడా అలానే డీల్ చేస్తాను. కేడర్ ఉద్దేశ్యం ఒకలాగా ఉంది. నా లక్ష్యం వేరుగా ఉంది. ఎందుకంటే.. నేను అందరి అభిప్రాయాలు తీసుకోవలి. అవతలి వాళ్లు చేసినట్లు నేను చేయను. చట్టం, న్యాయం ప్రకారం చేస్తాను. నేను ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదు.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మా కేడర్, నాయకులు లేదా అధికారులు ఎవరు తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలను పిలిచి అందరితో మాట్లాడుతున్నాను. అందరినీ కరెక్ట్ చేస్తాను. అలాగే కలిసి ముందుకు వెళ్తాను. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలిచేలా ఉండాలి. 2004 లో నన్ను ఎవరూ ఓడించలేరు. హైదరాబాద్‌ను ఎన్నడూ లేని విధంగా డెవలప్ చేశాను. కానీ, ప్రజలకు ఈ విషయాన్ని కమ్యూనికేట్ చేయలేకపోయాను. ఇప్పుడు ప్రజలకు చెప్పి మనం ముందుకు తీసుకెళ్లాలి.' సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. గతంలో మా పార్టీ నేతలను హతమార్చారు. జగన్ హయాంలో మా పార్టీ వాళ్ళు బాగా ఇబ్బంది పడ్డారు. అందరినీ మేము చాలావరకు సర్దుబాటు చేస్తున్నాము. అందరికీ పదవులు ఇవ్వలేం కదా. ఈ సారి జాగ్రత్తగా ఉన్నాము. అందరు అభిప్రాయాలు తీసుకుంటాను. నేను సభ్యత్వం, పదవులు పంపిణీ మీద అన్ని క్రాస్ చెక్ చేసుకుంటున్నాను. నా ఓన్ మెకానిజమ్ నాకు ఉంది. అందుకే ప్రతి విషయం క్రాస్ చేసుకుంటున్నాను. గంతలోలా నేను లేను. అన్ని విషయాలు నేను చూసుకుంటున్నాను.' అని సీఎం చంద్రబాబు తెలిపారు. దీపం, నాలుగు వేలు పెన్షన్ పథకాలను అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. 'కేంద్ర ప్రభుత్వానికి కూడా లిమిటేషన్స్ ఉంటాయి కదా. నేను ప్రజలను అభినందిస్తున్నాను. వాళ్లు ఇచ్చే సహకారం నేను మరువను. వాళ్లకు జరిగే దానిపై సంతృప్తి ఉంది. భవిష్యత్‌పై ఆశ ఉంది. వాళ్ల హోప్స్‌కి మేము రీచ్ కావాలి.' అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం సినిమాలకు హైదరాబాద్ హబ్‌గా మారింది. తెదేపా ప్రభుత్వం కల్పించిన అవకాశాల కారణంగానే ఇదంతా సాధ్యమైంది. సినిమాలకు ఓవర్సీస్ మార్కెట్ బాగా పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే.. సినిమాలన్నీ ఇక ఏపీలోనే నిర్మించేందుకు అవకాశం ఉంటుంది. అమరావతిలో సినిమాలకు మంచి మార్కెట్ ఉంటుంది' అని చంద్రబాబు తెలిపారు.

## బస్సును ఢీకొట్టిన లారీ.. ప్రయాణికులకు గాయాలు

**సంగారెడ్డి, జనవరి1( వెలుతురు):**
ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్‌లో ఓ ఆర్టీసీ బస్సు అల్గోల్ చౌరస్తా దాటుతుండగా వెనకనుంచి వచ్చిన ఓ లారీ బస్సును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయం

- ఎరువుపై మరింత సబ్సిడీ

**న్యూఢిల్లీ, జనవరి1( వెలుతురు):**
ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ 2025 సంవత్సరంలో తొలిసారి సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. డీఏపీ ఎరువుపై రైతులకు ఇచ్చే సబ్సిడీని మరింత పెంచాలని నిర్ణయించింది. డీఏపీపై అదనపు భారాన్ని కేంద్రమే భరించనుంది. ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా రూ.1350 కే లభ్యం కానుంది. కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుంది. అదేవిధంగా 'ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. అంతేగాక పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న పలు ముఖ్యమైన ప్రాజెక్టులపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.


## మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ



**న్యూఢిల్లీ, జనవరి1( వెలుతురు):**
దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కొత్త ఏడాది ఆరంభమైన బుధవారం, బీజేపీ రాజకీయాలకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. బీజేపీ తప్పులకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? అని కేజ్రీవాల్ నిలదీశారు. 'బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బులు పంచుతున్నారు. ఓట్లు కొనేందుకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? దళిత, పూర్వాంచల్ ప్రజల ఓటర్లను పెద్ద ఎత్తున ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదని ఆర్ఎస్ఎస్ భావిస్తుందా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తోందా?' అని కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రశ్నించారు. కాగా, కేజ్రీవాల్ లేఖపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'అబద్ధాలు, మోసం అనే మీ తప్పుడు అలవాట్లను వదిలిపెట్టి మీలో అర్థవంతమైన మార్పు తీసుకువస్తారని ఆశిస్తున్నాం' అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తాను లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు.

## తిరుమలల పెరిగిన రద్దీ

- న్యూ ఇయర్ కారణంగా భక్తుల రాక




**తిరుమల,జనవరి1( వెలుతురు):**
తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం తిరుమలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివెళు _న్నారు. వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 8 కంపార్టుమెంట్ లో భక్తులు వేచి ఉన్నారు. ఈ క్రమంలో టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి కేవలం 8 గంటల సమయం పడుతుంది. టైమ్ స్లాట్ దర్శనానికి 4 గంటల సమయం పడుతుంది. కాగా, మంగళవారం శ్రీవారిని 62,495 మంది భక్తులు దర్శించుకుని ముక్కులు తీర్చుకున్నారు. 19,298 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. టిటిడి హుండీ ఆదాయం రూ.3.8 కోట్లుగా ఉందని అధికారులు వెల్లడించారు.

## మాదాపూర్‌లో ఐటి కంపెనీలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):**
మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓ వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. భవనం ఐదో అంతస్తులోని నిపున్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రెండు ÷రిరజన్లతో మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో కార్యాలయంలోని సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. వాణిజ్య సముదాయంలో మంటలు చెలరేగడంతో మిగిలిన కార్యాలయాల్లోని సిబ్బంది ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.

## ఆదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు




- తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

**చెన్నై,జనవరి1( వెలుతురు):**
అదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఇటీవల అమెరికా పత్రిక ÷నాన్షియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఎఇఎస్ఎల్)తో స్మార్ట్ మీటర్ల సేకరణ కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ ( టిఎఎన్‌జిఇడిసిఒ) చేసుకున్న ఒప్పందాన్ని స్టాలిన్ ప్రభుత్వం రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక ధరలను కోట్ చేశారని, అందుకే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఆగస్టులో నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాలను కవర్ చేసే టెండర్‌లో ప్యాకేజీ 1కి కి అదానీ సంస్థ 82 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లను పంపిణీ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అదానీ సంస్థ కోట్ చేసిన ధర అధికంగా ఉన్నందున డిసెంబర్ 27, 2024న టెండర్‌ను రద్దు చేసినట్లు వెల్లడించాయి. మరో మూడు ప్యాకేజీల టెండర్లను కూడా రద్దు చేశామని తెలిపింది. మరోసారి టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.2020-2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అదానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటి చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేసినట్లు అమెరికా పత్రిక ÷నాన్సియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ÷నాన్షియల్ టైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయటపడింది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ప్రతివాదుల జాబితాలో చేర్చారు.

## పెనుబల్లి బిసి కాలనీలో దొంగల బీభత్సం

- పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డ దొంగలు

**ఖమ్మం,జనవరి1( వెలుతురు):**
జిల్లాలోని పెనుబల్లి మండలం బిసి కాలనీలో దొంగలు మంగళవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. జనసంచారం మధ్య జరిగిన ఈ దొంగతనం కలకలం రేపింది. వరుసగా మూడు ఇళ్ళలో చోరీకి పాల్పడిన దుండగులు 25 గ్రాముల బంగారం, 38 వేల రూపాయల నగదు, ఓ మొబైల్ ను అపహరించారు. ఈ సంఘటనతో కాలనీ వాసులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. దొంగతనం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరి కూడా లేకపోవడం దొంగలకు సులభంగా పని చేసింది. కాలనీలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో అర్ధరాత్రి చాలా మంది ప్రజలు బయట ఉండటంతో ఈ దొంగతనం జరిగినది. అయితే కేవలం కొద్దిసేపటికే విషయం బయటకు వెలుగు చూసింది. దొంగలు ఎటు పారిపోయారు అనేది అర్థంకాకపోవడంతో, కాలనీ వాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. కాలనీ వాసులు సమాచారం అందించి ఆ తర్వాత పోలీసుల సహకారంతో విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, కాలనీలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని వారు చెప్పారు. కాలనీ వాసులు ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ప్రాంతంలో పోలీస్ పహారా ఉన్నా, ఇలాంటి ఘటనలు సంభవించడంతో భయభ్రాంతులకు లోనవుతున్నారు. పోలీసులు దొంగలను త్వరగా పట్టుకోవాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

## అపహరణకు గురైన వ్యాపారవేత్త హత్య

**హైదరాబాద్,జనవరి1( వెలుతురు):**
హైదరాబాద్ పంజాగుట్టలో అపహరణకు గురైన వ్యాపారవేత్త విష్ణురూపాని హత్యకు గురయ్యాడు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. డిసెంబరు 29న పంజాగుట్టలో విష్ణురూపాని అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఆర్ నగర్‌లోని బుద్ధనగర్‌లో ఓ గది నుంచి దుర్వాసన వస్తుండటంతో బుధవారం స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా.. గదిలో విష్ణురూపాని మృతదేహం పడి ఉంది. గదికి బయట నుంచి తాళం వేసి ఉండటంతో హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com